## నిర్యాణము



కీ.శే. కోనా సుబ్బారావు గారు (Rtd. Teacher)

ది. 14-02-2024 బుధవారం రోజున
మా తండ్రిగారైన
**శ్రీ కోనా సుబ్బారావు గారు** (Rtd. Teacher)
స్వర్గస్థులైనారని తెలియజేయుటకు చింతిస్తున్నాము.
ది. 22-02-2024 గురువారం నిత్యకర్మ కార్యక్రమము
ది. 23-02-2024 శుక్రవారం దశాహం, దర్భోదకాలు, తిలోదకాలు.
ది. 24-02-2024 శనివారం షోడశం, సపిండీకరణం, మాసికం, ఇష్టబంతి, ఆశీర్వచనం.
మా స్వగృహము, బనిగండ్లపాడు గ్రా॥, ఎర్రుపాలెం మం॥, ఖమ్మం జిల్లా నందు జరుగును. కావున తెలియజేయనైనది.

ఇట్లు, కుమారులు
కోనా సుందరరామయ్య, కోనా శ్రీనివాసరావు,
కోనా చంద్రశేఖర్ అడ్వకేట్, ఖమ్మం, కోనా రమేష్,
సెల్ : 9640854179



నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
శనివారం 24, ఫిబ్రవరి 2024





# పేదోడి బియ్యం పెద్దోడు గుంజెస్తుండు






- పేదోడి బియ్యం పేదోడికి దక్కేనా..
- తెలంగాణ టు ఆంధ్ర కు బియ్యం అక్రమంగా తరలింపు
- రేషన్ షాపులే అడ్డాలు గా దళారుల దందా
- రైస్ మిల్లులో రీసైక్లింగ్.. లేవీ బియ్యంగా సరఫరా?!
- సివిల్ సప్లై శాఖ తీరుపై అనుమానాలు.
- బియ్యం మాఫియాను అణిచివేయాలని డిమాండ్

2 లో..

పెనుబల్లి సూర్య మేజర్ న్యూస్...
పేదోడి బియ్యాన్ని పెద్దోడు గుంజేస్తున్నాడు. పేదవాడి బియ్యం వారికి మేలు చేస్తుందో లేదో కానీ...కొందరు అక్రమార్కులకు వరంగా మారి కాసుల పంట పండిస్తుందని ప్రజలు అనుకుంటున్నారు. కొందరు బియ్యం మాఫియాగా తయారై అడ్డదారుల్లో అక్రమంగా తరలించి జోబులు నింపు కుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

## సీతారాంపురంలో చోరీ



2 లో..

### రూ.1.50 లక్షల పుస్తెతాడు అపహరణ

సింగరేణి సూర్య మేజర్ న్యూస్ సింగరేణి (కారేపల్లి ఫిబ్రవరి 23)మండలం సీతారాంపురంలో చోరి జరిగింది. ఈ చోరిలో రూ.1.50 లక్షల విలువైన బంగారాన్ని దొంగలు ఎత్తుకెళ్ళారు. దీనికి సంబంధించి బాధితుడు వీరెల్లిశ్యాంసుందర్, పోలీసుల కథనం ప్రకారం.. సీతారాంపురంకు చెందిన వీరెల్లి శ్యామ్ సుందర్ కుటుంబం ఈనెల 21వ తేదిన మేడారం జాతరకు వెళ్ళారు.ఇంట్లో ఎవరు లేక పోవటంతో దుండగులు ఇంటి తలుపు తాళం పగులగొట్టి లోనికి ప్రవేశించారు.ఇంట్లో ఉన్న బీరువా తాళాలు తొలగించి దానిలో ఉన్న మూడు తులాల పుస్తెల తాడును ఎత్తుకెళ్లారు. దీనికి సంబంధింతి బాధితుడు ఇచ్చిన పిర్యాదు మేరకు కారేపల్లిఎస్సై రాజారామ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మిర్చి కూలీల ఆటో పల్టీ

- అతివేగమే ఈ ప్రమాదానికి ప్రధాన కారణం అంటున్న స్థానికులు
- ఏడుగురికి తీవ్ర గాయాలు
- క్షతగాత్రులను ఖమ్మం ప్రభుత్వ వైద్యశాలకు తరలింపు



2 లో..

## నేడు పాలేరు నియోజకవర్గంలో పొంగులేటి ప్రసాద్ రెడ్డి పర్యటన



2 లో..

## బిఆర్ఎస్ కు మరో బిగ్ షాక్?




బి.ఆర్.ఎస్ ,బి.జే.పి తో పొత్తు పై వస్తున్న వార్తల నేపథ్యంలో బి.ఆర్.ఎస్ పార్టీకి రాజీనామా చేసే యోచనలో పల్లా కిరణ్ ?

2 లో..

## స్కూల్ బస్ కు తప్పిన పెను ప్రమాదం








2 లో..

ఖమ్మం సూర్య మేజర్ న్యూస్ ఖమ్మం సిటీలో స్కూల్ పిల్లలను ఇంటికి తీసుకెళ్లే క్రమంలో కాకతీయ స్కూల్ బస్ కు శుక్రవారం పెను ప్రమాదం తప్పింది.ఖమ్మం నగరంలోని టేకులపల్లి వద్ద స్కూల్ బస్ డ్రైవర్ యూ టర్న్ తీసుకునే సమయంలో సిగ్నల్ వేయకుండా సడన్ బ్రేక్ వేయడంతో,వెనుక నుంచి వచ్చిన లారీ ఢీ కొట్టింది.

# మిర్చి కూలీల ఆటో పల్టీ

**కల్లూరు సూర్య న్యూస్ ఫిబ్రవరి (23) :**
కల్లూరు మండల పరిధి పెద్దకోరుకొండి, పోచవరం గ్రామాల మధ్య శుక్రవారం ఉదయం 8 గంటల సమయంలో మిర్చి తోటలకు వెళ్తున్న కూలీల ఆటో ఒక్కసారిగా పల్టీ కొట్టింది. ఆటోలో 20 మంది కూలీలు ఉండగా వారిలో ఏడుగురు తీవ్ర గాయాల పాలైనారు. వారిని అంబులెన్స్ సహాయంతో కల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి అక్కడ వైద్యం అనంతరం ఖమ్మం ప్రభుత్వ వైద్యశాల కు తరలించడం జరిగిందని అక్కడ స్థానికులు తెలిపారు.

**వివరాలు ఇలా ఉన్నాయి :**
తల్లాడ మండల పరిధి కుర్నవల్లి గ్రామానికి చెందిన మిర్చి తోటలకు వెళ్తున్న రోజు వారి కూలీలు నిత్యము మిర్చి తోటలకు వెళుతూ, ఉంటారు. అదే క్రమంలో శుక్రవారం ఉదయం 8 గంటల సమయంలో ఒక్కసారిగా పెద్ద కోరుకొండి,పోచవరం గ్రామాల మధ్య ఆటో పల్టీ కొట్టడంతో ఆటోలో ఉన్న 20 మంది కూలీలలో ఏడుగురు కూలీలకు తీవ్ర గాయాల అయ్యాయి . తీవ్ర గాయాలు అయిన వారిలో బధలమ్మ (55) , మల్లారం ఈశ్వరి (45) , బండి పద్మ (50) , చీమకుర్తి వెంకమ్మ (60) , ఈదుల పద్మ (45) ,



శీలం వెంకటేశ్వర్ రెడ్డి (70) వీరు మొత్తం తల్లాడ మండలం కుర్నవల్లి గ్రామానికి చెందిన వారి గా గుర్తించారు .విషయం తెలుసుకున్న కల్లూరు ఎస్సై షేక్ షాకీర్ హుటా హుటిన ఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను అంబులెన్స్ సహాయంతో కల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి, అక్కడ వైద్యం అందించి , అనంతరం వారిని వెను వెంటనే ఖమ్మం ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు వారు తెలిపారు. ఈ ప్రమాదానికి గల ప్రధాన కారణం ఆటో డ్రైవర్ అతివేగము, అతని,నిర్లక్ష్యమే నని, అటు ఉన్న చుట్టుపక్కల వారు తెలిపారు. ఆటోలో అంత మంది కూలీలను ఎక్కించుకొని అందులో భాగంగా సెల్ఫోన్ మాట్లాడుకుంటూ ,అతివేగంతో వస్తూ, ఒక్కసారిగా ఆటో పల్టీ కొట్టిందని ,ఆ రూట్ లో ఉన్న చుట్టుప్రక్కల స్థానికులు వాపోతున్నారు. ఏదేమైనా ఆటో డ్రైవర్ అతివేగమే ఈ ప్రమాదానికి ప్రధాన కారణం అని పలువురు ఆరోపిస్తున్నారు. పొట్ట కూటికోసం ప్రతిరోజు మిర్చి తోటలకు వెళ్లే కూలీలకు ఆటోలు కానివ్వండి , ట్రాక్టర్లో కానివ్వండి ,మినీ వ్యాన్ లో కానివ్వండి పరిమితికి మించిన కూలీలను తీసుకువెళ్లడం గమనార్హం.ఈ క్షణం వరకు కూడా అటువంటి ఆటో డ్రైవర్ ల అతివేగము , నిర్లక్ష్యం పై చర్యలు తీసుకోక పోవడం విశేషం. కొంతమందికి ఆటోలకు సంబంధించిన పత్రాలు కానివ్వండి, వారికి లైసెన్స్ కూడా లేకుండా డ్రైవింగ్ చేయడం శోచనీయం. ఇకనైనా పోలీస్ వారు ఆటోలో పరిమితికి దగ్గట్టు గా కూలీలను ఎక్కించుకొని వెళ్లాలని పలువురు పోలీసు వారిని వేడుకుంటున్నారు.

# పేదోడి బియ్యం పెద్దోడు గుంజెస్తుండు...

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం జయంతి, తిరువూరు కు చెందిన కొందరు బియ్యం బకాసురులు సత్తుపల్లి నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో ఏజెంట్లను నియమించి బియ్యం దందాని అడ్డు అదుపు లేకుండా కొనసాగిస్తూ మమ్మల్ని ఆపేదవ్వరా...అనేలా రెచ్చిపోతున్నారని ఎవ్వరైనా ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడుతూ బ్లాక్ మెయిల్ చేస్తున్నారని ఆరోపణలు వినవస్తున్నాయి. నియోజకవర్గంలోని సత్తుపల్లి, పెనుబల్లి, కల్లూరు, వేంసూరు, తల్లాడ మండలాలు ఆంధ్ర రాష్ట్ర సరిహద్దు మండలాలుగా ఉండడంతో బియ్యం మాఫియా సామ్రాజ్యాన్ని విస్తరించి భయం, బెరుకు లేకుండా తరలించటమే కాకుండా కొందరికి భోహిరంగంగానే తాము మామూళ్ళు ముట్టచెప్తున్నామని ఏ అధికారి తమ వద్దకు రాదని, అడ్డుకోరని చెప్పటం.. దానికనుగుణంగా సమాచారం అందించినా అధికారులు కూడా అటువైపు కన్నెత్తి చూడకపోవటం చూస్తుంటే అక్రమార్కుల మాటలు నిజమేనేమో అన్న అనుమానాలు ప్రజల్లో వ్యక్తం అవుతున్నాయి.



**రేషన్ డీలర్లు, అధికారులపై విమర్శలు**
కొందరు దళారులు రేషన్ షాపు లనే అడ్డాగా చేసుకుని బియ్యాన్ని పక్కదారి పట్టించే ప్రక్రియ మొదలు పెడుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. లబ్ధిదారులు రేషన్ షాప్ లో బియ్యం తీసుకుని బయటకు రాగానే దళారులు వారి చేతిలో మూటలను, మాటలు కలిపి తీసేసుకుంటున్నారని రేషన్ షాపు డీలర్ల పాత్ర దందాలో లేకపోలేదని, రేషన్ డీలర్లు, గోడౌన్ ఇంచార్జ్ లు కుమ్మక్కై గోడౌన్ ల నుండే సరుకు పావు వంతు దారిమళ్ళిస్తున్నారని జిల్లా స్థాయి నుండి కూడా గౌడన్ కు సగం సరుకు రావట్లేదనే గుసగుసలు వినిపిస్తున్నాయి. పేదల బియ్యంతో అక్రమార్కులు, డీలర్లు, అధికారులు కోట్లు కొల్లగొడుతున్నారని పేదలు కడుపులు మాత్రం కాలుతున్నాయని ప్రజాసంఘాలు విచారం వ్యక్తం చేస్తున్నాయి. రేషన్ బియ్యం అధిక శాతం లబ్ధిదారులు తినడానికి ఆసక్తి చూపడం లేదనేది జగమెరిగిన సత్యం. రేషన్ తీసుకోకపోతే రేషన్ కార్డు రద్దు అవుతోందని బియ్యాన్ని వదులుకోవడం ఎందుకని పేద ,మధ్యతరగతి లబ్ధిదారులు బియ్యాన్ని తీసుకుంటున్నారు. అదే అదునుగా దళారులు ద్విచక్ర వాహనాలపై వీధుల్లో తిరిగి సరుకు సేకరించి డంప్ చేస్తారని ఇక్కడి నుండి అసలు కథ ప్రారంభమవుతుందని అనంతరం అక్రమార్కుల ముఠా రంగంలోకి దిగి దందా షురూ చేసి చిన్న, భారీ వాహనాల్లో ప్రక్క రాష్ట్రాలకు తరలిస్తారంటున్నారని అక్కడినుండి భారీ వాహనాల్లో కొన్ని రైస్ మిల్లులకు, కాకినాడ పోర్టుకి తరలిస్తారని సామాన్యుల సైతం చర్చించుకుంటున్నారు.

**ఎఫ్సీఐకి లేవీ బియ్యం పేరుతో సరఫరా**
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో కొన్ని రైస్ మిల్లులు రీసైక్లింగ్ వ్యాపారం సాగిస్తుంటాయని కస్టమ్ మిల్లింగ్ రైస్ అనుమతి పొందిన కొన్ని రైస్ మిల్లులు తమ మిల్లుల లేబుల్స్ పై ఉన్న గన్ని బస్తాలలో రీసైకిల్ చేసిన రేషన్ బియ్యాన్ని తిరిగి ఎఫ్సీఐకి లేవీ బియ్యం కింద అంట కడుతున్నారన్న ఆరోపణలు జనంలో వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం సిఎంఆర్ కోసం సరఫరా చేసిన ధన్యాన్ని బయట ఎక్కువ ధరకు అమ్ముకొని రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసుకొని తమ మిల్లుల పేరుతో ఎఫ్ సి ఐ కి సరఫరా చేసి కోట్లు గడిస్తున్నారని మేధావులు అంటున్నారు.

**సివిల్ సప్లై శాఖ పై ప్రజల్లో పలు అనుమానాలు**
నిత్యం పేదోడి బియ్యం పెద్దోడు అక్రమంగా తరలించి పేదవాడి నోటి కాడ కూడు లాగేసుకుని అక్రమ సంపదను పోగేసుకుంటున్నా..అక్రమ తరలింపుని చూసి చూడనట్లు వ్యవహరిస్తున్న తీరుపై ప్రజల్లో పలు అనుమానాలకు రేకెత్తిస్తుందని.. అధికారుల అండదండలు లేకుండా బియ్యం బకాసురులు ఇంతకి బరితెగిస్తారా.. అని ప్రజలు తమని తామే ప్రశ్నించుకుంటున్నారు. కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ తరలింపుపై ఉక్కు పాదం మోపి పేదోడి బియ్యం పేదోడికే దక్కేలా చర్యలు తీసుకుంటుందని ప్రజలు ఆశిస్తున్నారు. వేచి చూడాలి మరీ.....

## స్కూల్ బస్ కు తప్పిన పెను ప్రమాదం.

బస్ లో 20 మంది పిల్లలు ఉన్నారు.వారిలో ఇద్దరు పిల్లలకు స్వల్ప గాయాలయ్యాయి.హాస్పిటల్ కు తీసుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు.ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు స్కూల్ బస్ ను,లారీని స్టేషన్ కు తీసుకెళ్లి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## నేడు పాలేరు నియోజకవర్గంలో పొంగులేటి ప్రసాద్ రెడ్డి పర్యటన

ఖమ్మం సూర్య ప్రతినిధి: కాంగ్రెస్ జిల్లా నాయకులు పొంగులేటి ప్రసాద్ రెడ్డి పాలేరు నియోజకవర్గంలో శనివారం పర్యటించనున్నారు. ఈ మేరకు పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి శు క్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పర్యటనలో భాగంగా నియోజకవర్గంలోని ఖమ్మం రూరల్, తిరుమలాయపాలెం, కూసుమంచి, నేలకొండపల్లి మండలాల్లో జరిగే పలు వివాహాది శుభకార్యక్రమాలు, దైవ వేడుకల్లో పాల్గొంటారని తెలిపారు. కావున నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులందరూ అధిక సంఖ్యలో హాజరై ప్రసాద్ రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని దయాకర్ రెడ్డి కోరారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



**పెనుబల్లి సూర్య మేజర్ న్యూస్....**
పెనుబల్లి మండలం బయ్యన్నగూడెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. అన్నపురెడ్డిపల్లి మండలం మర్రిగూడెం చెందిన వేపాకుల వెంకన్న విజయవాడ నుండి స్వగ్రామం మర్రిగూడెం బైక్ పై వెళు తుండగా బయ్యనగూడెం సాయి నగర్ వద్ద జాతీయ రహదారి పై బైక్ అదుపుతప్పి పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు హుటాహుటిన పెనుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బైక్ కి ఆవు అడ్డు రావడంతో బైక్ అదుపుతప్పి ప్రమాదం చోటు చేసుకుందని కుటుంబ సభ్యులు తెలిపారు.

## బిఆర్ఎస్ కు మరో బిగ్ షాక్?

ఖమ్మం, సూర్య (మేజర్ న్యూస్)బీఆర్ఎస్ పార్టీ బిజెపితో పొత్తు పెట్టుకుంటారని వస్తున్న వార్తల నేపథ్యంలో ఖమ్మం జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి, మాజీ సుడా డైరెక్టర్ ప్రముఖ సమాజ సేవకుడు పల్లా కిరణ్ బి.ఆర్.ఎస్ పార్టీకి రాజీనామా చేసే యోచనలో ఉన్నట్లు తెలుస్తుంది. ఇంకా పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

## క్రికెట్ క్రీడాకారులకు మంత్రి పొంగులేటి ఆర్థిక సాయం

ఖమ్మం : ఈనెల 24, 25, 26 వ తేదీల్లో హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో జరిగే సేవాలాల్ మహారాజ్ రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు వెళ్లే జిల్లా జట్టు క్రీడాకారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆర్థిక సహాయం అందచేశారు. రూ. 15వేల మొత్తాన్ని ఖమ్మం క్యాంప్ కార్యాలయ సిబ్బంది కూసుమంచి మండలానికి చెందిన భూక్య వేణు మాధవన్, వెంకటేష్ వడిత్య విజయ్, గుగులోత్ శ్రీకాంత్ అనే క్రికెట్ క్రీడాకారులకు అందించారు. క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జ్ దయాకర్ రెడ్డిని కలిసి.. తమ రవాణా, ఇతర ఖర్చులకోసం సాయం చేయాలని విన్నవించగా.. వెంటనే స్పందించి రూ. 15,000 ఆర్థిక సాయంగా అందించారని వారు ఆనందం వ్యక్తం చేశారు.



# హస్పిటల్స్ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

### ఇఫ్టూ పాలేరు ఏరియా కార్యదర్శి పగిడికత్తుల రామదాసు

**నేలకొండపల్లి సూర్య మేజర్ న్యూస్**



స్థానిక ప్రభుత్వ హాస్పిటల్స్ లో పని చేసే కార్మికుల కు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని ఇఫ్టూ పాలేరు ఏరియా కార్యదర్శి పగిడికత్తుల రామదాసు డిమాండ్ చేశారు.వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రం ను శుక్రవారం స్థానిక మెడికల్ ఆఫీసర్ మంగళ కు అందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...నేలకొండపల్లి ప్రభుత్వ హస్పిటల్స్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ లో పని చేస్తున్న కార్మికుల కు మూడు నెలల గా జీతాలు చెల్లించటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఉద్యోగ భద్రత,పీఎఫ్, ఈఎస్ఐ లాంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. ప్రతీ నెలా నాలుగు సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వాలని,కనీస వేతనాల చట్టం ను అమలు చేయాలని కోరారు.ఔట్ సోర్సింగ్ సిబ్బంది కి నెలకు రూ.21 వేలు ఇవ్వాలని అన్నారు.ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు హిరాలాల్, జి ఆనంద్, సైదావలి,సుజాత, కమలమ్మ, వీరకుమారి, కౌసల్య,పగిడి కత్తుల శ్రీలత,సాయి పాల్గొన్నారు.

# చెరువుమాదారం చెరువు ను నీటితో వెంటనే నింపాలి

### తాగు,సాగు కు ప్రజలు తీవ్ర ఇబ్బందులు

### సీపీఐ మండల సహాయ కార్యదర్శి పాల్తీయ శ్రీనివాసరావు



నేలకొండపల్లి సూర్య మేజర్ న్యూస్

మండలం లోని చెరువుమాధారం చెరువు ను వెంటనే నింపాలని సీపీఐ మండల సహాయ కార్యదర్శి పాల్తీయ శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.అడుగంటిని చెరువుమాధారం చెరువు ను శు క్రవారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నిత్యం కళకళాలాడే చెరువును కొంత మంది స్వార్థం కోసం ఖాళీ చేశారని అన్నారు. దీని వలన ఇటు రైతాంగం, ఆటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. చెరువు అయకట్టు కింద ఉన్న వరి పొలాలు బిర్రు పొట్ట మీద ఉన్నాయని . అన్నారు.వెంటనే సాగునీటి ని విడుదల చేయకపోతే వేలాది ఎకరాలు వరి పంటలను కోల్పోవాల్సి ఉందని అన్నారు.చెరువు నీటిని నిల్వను కాపాడాన కాపాడవలసిన ఇరిగేషన్ అధికారులు నిరక్యం వలన పూర్తిగా అడుగంటిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సాగుకే కాదు మంగాపురం చెరువు మాదారం భైరవులపల్లి రాయగూడెం తదితర గ్రామాల్లో తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే చెరువు మాదారం చెరువులు వెంటనే నింపాలని కోరారు. లేనిపక్షంలో రైతులు లక్షల రూపాయల నష్టం చూస్తారని అన్నారు. చెరువు ఆయకట్టు రైతులు భగిరద ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే నీటి విడుదలకు చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రభుత్వం వెంటనే నీటి విడుదలకు చర్యలు తీసుకోవాలని కోరారు.ఆయన వెంట పార్టీ నాయకులు పలువురు పాల్గొన్నారు.

# మహిళలకు నైపుణ్యశిక్షణ గురించి వర్కుషాప్ నిర్వహణ



వైరాసూర్యమేజర్ న్యూస్: తెలంగాణ రాష్ట్ర ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ప్రొడక్టివిటీ కౌన్సిల్ వారిచే వైరాలో నిరుద్యోగ మహిళలకు స్థానిక శ్రీ కన్యక పరమేశ్వరి కల్యాణ మండపం హాల్ –టూ లో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా జిల్లా ఉపాధి కల్పన అధికారి శ్రీరామ్ , మరియు ఏపిపిసి కో ఆర్డినేటర్ సత్యం,మరియు శిక్షణ నిర్వహుకులు వీరభద్రంచారి మరియు అధికారులు యువత పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారి మాట్లాడుతూ యువత ఉపాధి అవకాశాల్ని అందుకోవాలని ఇలాంటి నైపుణ్యశిక్షణ అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# బిజెపి పెనుబల్లి మండల పార్టీ సమావేశం

### విజయ సంకల్పయాత్ర పోస్టర్లు ఆవిష్కరణ





పెనుబల్లి సూర్య మేజర్ న్యూస్....భారతీయ జనతా పార్టీ పెనుబల్లి మండల శాఖ మండల అధ్యక్షుడు బోర్ర నరసింహారావు ఆధ్వర్యంలో విజయ సంకల్ప యాత్ర సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు వినోద్ రావు తాంద్ర పాల్గొన్నారు. ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి విజయ సంకల్ప యాత్రను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం విజయ సంకల్ప యాత్ర పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో యాత్ర ఇంచార్జ్ తిరుపతి రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ నంబూరు రామలింగేశ్వర రావు, అసెంబ్లీ కన్వీనర్ భస్కర్ని వీరంరాజు, జిల్లా కార్యదర్శి మున్నా మిశ్రా,పెనుబల్లి మండల ప్రధాన కార్యదర్శి ఓరుగంటి రాము, ఎస్సీ మోర్చ పెనుబల్లి మండల అధ్యక్షులు పేర్ల మహేష్, ఉపాధ్యక్షులు గోదా శ్రీనివాసరావు, రేగళ్ల వెంకటేశ్వర్లు, మల్లెల నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా క్రాంతి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వీడ్కోలు సభ







**వైరాసూర్యమేజర్ న్యూస్:** స్థానిక ఠాగూర్ విద్యాసంస్థలైన క్రాంతి జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమాన్ని విద్యాసంస్థల చైర్మన్ వాసిరెడ్డి సునీత అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ సంక్రాంతి రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి రాబోయే ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో రాష్ట్రస్థాయి మార్కులు సాధించాలని, సూచించారు. క్రమశిక్షణ నైతిక విలువలతో కూడిన విద్యా బోధన చేయడమే మా క్రాంతి జూనియర్ కళాశాల ప్రత్యేకత అని అన్నారు.గత విద్యా సంవత్సరంలో రాష్ట్రస్థాయి మార్కులు సాధించిన విద్యార్థులను మరియు వివిధ సామాజికసేవ, సాంస్కృతిక, కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులను అభినందించి బహుమతులు ఇవ్వడం జరిగింది.అనంతరం విద్యార్థులు ఆటపాటలతో నృత్యాలు చేస్తూ అలరించారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ వాసిరెడ్డి సునీత, డైరెక్టర్ సంక్రాంతి సంయోగిత, ఉపాధ్యక్షులు ఉమాశంకర్, ప్రముఖ మోటివేటర్ తాటిపల్లి సుధీర్, ప్రిన్సిపల్ కృష్ణారావు,యన్ యస్ యస్ పీఓ. లింగారావు, అధ్యాపకులు మజీద్,వేణు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# కోడిపందాల స్థావరాలపై దాడులు



కల్లూరు సూర్య న్యూస్ ఫిబ్రవరి (23) : మండల పరిధి పెద్ద కోరుకొండి గ్రామం మెయిన్ సెంటర్ రామాలయం వీధిలో మసీదు రోడ్ లో గల వెనుక భాగంలో కళ్ళు దుకాణం వద్దసమాచారం మేరకు కోడిపందాలు స్థావరాలపై కల్లూరు ఎస్సై షేక్ షాకీర్ తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. అందులో భాగంగా,ఇద్దరు వ్యక్తులను అదుపులో తీసుకొని వారి వద్ద ఉన్న మూడు కోడి పుంజులు టూ విల్లర్ బైక్ ,కొంత నగదును, వారు స్వాధీనం చేసుకున్నారు అనంతరం మిగిలిన వారి కోసం గాలిస్తున్నారు . కోడి పందాల స్థావారాల వద్ద పందాలు వేసే వారిని ఇద్దరు వ్యక్తులను అదుపులో తీసుకొని స్టేషన్కు తరలించారు.

# విజయ సంకల్ప యాత్రను విజయవంతం చెయ్యండి రంగరాజురుక్మారావుపిలుపు.



వైరాసూర్యమేజర్ న్యూస్: ఫిబ్రవరి 26 వ తారీఖున భద్రాచలం నుండి బయలుదేరి వైరా వస్తున్న విజయ సంకల్ప యాత్రలో భాగంగా శుక్రవారము వైరాలో సన్నాహక సమావేశం వైరా అసెంబ్లీ కన్వీనర్ నెల్లూరి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో , రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కొవ్వూరి నాగేశ్వరరావు. నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా వైరా అసెంబ్లీ ప్రబారీగా నియమితులైన రంగరాజు రుక్మారావు పాల్గొని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేయటం జరిగినది. ఈ కార్యక్రమం వైరా టౌన్ అధ్యక్షులు ఏలే భద్రయ్య అధ్యక్షతన జరిగినది . మనుబోలు వెంకటకృష్ణ .ఓర్సు శ్రీనివాస్. పల్లపాటి వెంకటేష్ . చింతనిప్పు రామారావు .నల్ల మోతు కోటిరెడ్డి .మింటు సింగ్. తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత, సైబర్ నేరాల పట్ల అవగాహన



**పెనుబల్లి సూర్య మేజర్ న్యూస్...**

సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని,రోడ్డు భద్రత ప్రమాణ పాటిస్తూ వాహనాలు నడపాలని విఎం బంజర్ పోలీసులు సూచించారు. పోలీసు ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు వియ్యం బంజర్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ కే. వెంకటేష్ ఆధ్వర్యంలో వియ్యం బంజర పోలీసు స్థానిక ప్రజలకు రోడ్డు భద్రతా నియమాలు, సైబర్ నేరాల పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 18 ఏళ్ళు నిండిన ప్రతి ఒక్కరు లైసెన్స్ కలిగి ఉండి హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని సూచించారు. మైనర్లు వాహనాలు నడిపితే నేరమని తెలిపారు. సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని లాటరీ తగిలిందని లక్షల్లో ఫోన్ మెసేజ్ ల ద్వారా ఆశ చూపిస్తారని అటువంటి మెసేజ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని బ్యాంకు వివరాలు, ఓటీపీలు ఎవరు అడిగినా చెప్పకూడదని తెలిపారు. అపరిచిత వ్యక్తులు మెసేజ్ లకు, ప్రలోభాలకు గురి కాకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అనుమానాస్పద ఫోన్ కాల్స్, మెసేజ్ లకు స్పందించకుండా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్స్ బి. పుల్లయ్య, బి. వెంకటేశ్వరరావు, ఉపేందర్, ఎస్ కే మెహబూబి తదితరులు పాల్గొన్నారు.

# 28 నుండి మార్చి 19 వరకు ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు

**70 కేంద్రాల్లో పరీక్షలు వ్రాయనున్న**
**36,578 మంది విద్యార్థులు**
**జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖ**
**అధికారి రవిబాబు**





**ఖమ్మం, సూర్య (మేజర్ న్యూస్):**ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖ అధికారి రవిబాబు చీఫ్ సూపెరింటెండెంట్లు, డిపార్ట్మెంటల్ అధికారులకు సూచించారు.ఈ నెల 28 నుండి మార్చి 19 వరకు ఉదయం 9 గంటల నుండి మధ్యాన్నం 12 గంటల వరకు కొనసాగనున్న ఇంటర్మీడియట్ ప్రధమ, ద్వితీయ పరీక్షల నిర్వహణపై శుక్రవారం నూతన కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలోఅధికారులకు దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధులు కేటాయించిన అధికారులు వెంటనే ఆయా పరీక్షా కంద్రాలను సందర్శించి ఫర్నీచర్, విద్యుత్, మంచినీరు, వెలుతురు వంటి మౌలిక సదుపాయాలును పరిశీలించి ఏమైనా లోటుపాట్లు ఉంటె తెలిపితే తగు చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునే విధంగా ఆర్టీసీ బస్సులు నడిపేలాచర్యలు తీసుకోవడంతో పాటు పరీక్షా కేంద్రాలవద్ద ప్రథమ చికిత్స ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జిల్లాలో ప్రధమ,ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 36,578 మంది పరీక్షలు వ్రాయనున్నారని, ఇందుకోసం 70 కేంద్రాలలో పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. సి.సి.కేమేరా నిఘాలో పరీక్షలు కొనసాగుతాయని, ఎటువంటి మాల్ ప్రాక్టీస్, దుర్వినియోగా లకు అవకాశం ఇవ్వకుండా పరీక్షలు సజావుగా నిర్వహించాలన్నారు. అధికారులకు ఇచ్చిన బుక్ లెట్ లోని మార్గదర్శకాలను ఖచితంగా పాటిస్తూ విద్యార్థులకు నిర్దారిత సమయంలో ప్రశ్నా పత్రాలు, జవాబు పత్రాలు అందించాలని, వాటిపై విద్యార్థులు హాల్ టికెట్ సరిగ్గా వేసేలా ఇన్విజిలేటర్ సంతకం చేసేలా చూడాలన్నారు.విద్యార్థులు గంట ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా చూడాలని, ఉదయం 9.00 గంటల తరువాత పరీక్షా కేంద్రానికి అనుమతించారాదని స్పష్టం చేశారు.స్మార్ట్ ఫోన్లు, మొబైల్స్, స్మార్ట్ వాచీలు తదితర ఎలక్ట్రానిక్ గాడ్జెస్ పరీక్షా కేంద్రాలలో అనుమతించబడవని అన్నారు. సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తాయ న్నారు. జవాబుపత్రాలను క్లోస్డ్ కంటైనెర్ లో తరలించేలా చూడాలని తపాలా శాఖకు సూచించారు. పరీక్షా కేంద్రాలకు సమీపంలో జిరాక్స్ కేంద్రాలను మూసివేయాలని, 144 సెక్షన్ అమలు చేయాలనీ రెవెన్యూ, పోలీస్ అధికారులను సూచించారు. ఈ సమావేశంలో హైపవర్ కమిటీ డాక్టర్ కి. శ్రీనివాసరావు, మెంబర్స్ వెంకటేశ్వరరావు, సింహాచలం, వీరభద్రం చీఫ్ సూపెరింటెండెంట్లు, శాఖాపర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సదరం స్లాట్ తో అందని ద్రాక్షగా ఆసరా

**వికలాంగులకు శాపంగా**
**సదరం స్లాట్ బుకింగ్**
**ఏళ్ల తరబడి తిరుగుతున్న**
**స్లాట్ కావట్లేదు**
**ఆదుకోండంటూ ఆర్డిఓ కి విన్నపం**



**కల్లూరు ఫిబ్రవరి 23(సూర్య న్యూస్):**
అసలు జీవితమే అంధకారం. కుటుంబ సభ్యులపై ఆధారపడి జీవనాధారం. ఆసరా పింఛన్ వస్తే కనీస అవసరాలకు ఆదుకుంటాయని ఆశతో వస్తే ఆశలు అడియాశలై నిరాశతో వెనుతిరిగి పోవాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్న దివ్యాంగుల దీనగాథ. ప్రభుత్వాలు దివ్యాంగులకు ఆసరా పింఛన్ ఇవ్వాలంటే ముందస్తుగా తనకున్న వైకల్యాన్ని సంబంధిత డాక్టర్ తో నిర్ధారించి సర్టిఫికెట్ ఇవ్వాల్సి ఉంటుంది. సర్టిఫికెట్ పొందడానికి మీసేవ కేంద్రాల్లో ప్రభుత్వం నిర్ధారించిన తేదీల్లో సదరం స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. అందుకోసం సదరం స్లాట్ తేదీ ఖరారైయిన తర్వాత మీసేవ కేంద్రాలకి వచ్చి స్లాట్ బుక్ చేయించుకున్న తర్వాత జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో వైకల్యం శాతాన్ని నిర్ధారించి సర్టిఫికెట్ ఇవ్వడం జరుగుతుంది. కానీ వికలాంగులకు సదరం స్లాటే శాపంగా మారింది. ఏళ్ల తరబడి మీసేవ కేంద్రాల చుట్టూ తిరిగిన ఎటువంటి ప్రయోజనం లేకపోగా ఆసరా పింఛన్ అందని ద్రాక్షలాగా మారుతుందని వాపోయారు. పరిమితమైన స్లాట్ బుకింగ్ ఉండడంతో ఒక్కొక్క మీసేవ కేంద్రానికి ఒకటి నుంచి ఐదు లోపు మాత్రమే స్లాట్ అవుతుంది. దీంతో మిగతా వారంతా ఇంటి దారి పట్టాల్సిందే. మీ సేవకు రావడం పోవడం ఇదే తంతుగా మారింది. కొంతమంది అయితే ఐదు సంవత్సరాలు పైబడి మీ కేంద్రాల చుట్టూ తిరుగుతున్నామని ఆవేదన చెందుతున్నారు. దేవుడు వరమిచ్చిన పూజారి కరుణించలేదన్నట్లు మా ప్రాయాసంత స్లాట్ దగ్గరే ఆగిపోతుందని ఆవేదన చెందుతున్నారు. సదరం స్లాట్ తేదీ వచ్చిందంటే ఒకపక్క సంతోషం ఉన్నప్పటికీ మరోవైపు ఆందోళన తప్పట్లేదు. మా పరిస్థితులను ప్రభుత్వాలు అర్థం చేసుకొని అవకాశం ఉన్న అందరికీ సదరం సర్టిఫికెట్ అందించాలని కోరుతున్నారు. ఐదు ఆరు సంవత్సరాలుగా తిరుగుతున్న దివ్యాంగులు వారి తల్లిదండ్రులు మనోవేదనతో మమ్మల్ని ఆదుకోండి అంటూ ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రం అందించారు. ఏది ఏమైనా వికలాంగుల బాధ వర్ణనాతీతం. వారికి సదరం సర్టిఫికెట్లు అందించి ఆసరా పింఛన్ కు అర్హత పొందేలా ప్రభుత్వాలు ఉన్నత అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. వికలాంగులు మీ సేవలు చుట్టూ తిరగకుండా మండల కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రత్యేక క్యాంపులు పెట్టి సర్టిఫికెట్లు ఇప్పించాలని కోరుతున్నారు.

## బిఆర్ఎస్ సభ్యత్వ బీమా చెక్కు అందజేత



**పెనుబల్లి సూర్య మేజర్ న్యూస్...**

పెనుబల్లి మండలంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య పర్యటించారు. అకిక వేడుకలు జరుపుకున్న పెనుబల్లి బీసీ కాలనీకి చెందిన షేక్ బాజీ కుమారుడు ఇమ్రాన్ ఆసిఫ్, కుమార్తె సుహానా లను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. కొత్త కరాయగూడెం, ఎల్ ఎస్ బంజర్ గ్రామాల్లో ఇటీవల మరణించిన వారి కుటుంబాన్ని పరామర్శించారు. బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వం కలిగిన కొత్త కారాయి గూడెం లోని మృతుని కుటుంబానికి ప్రమాద బీమా చెక్కుని అందజేశారు. బయ్యనగూడెంలో అనారోగ్యానికి గురి అయిన వారిని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి చెక్కిలాల మోహన్రావు, చెక్కిలాల లక్ష్మణరావు, కనగాల వెంకటరావు, లగడపాటి శ్రీను, పసుమర్తి వెంకటేశ్వరరావు, మందడపు అశోక్ కుమార్, తావు నాయక్, గోదా చెన్నారావు, కొప్పుల గోవిందరావు, కర్నాటి వీరభద్రారెడ్డి, తడికమల్ల తాతారావు, షేక్ గౌస్, కోమటి ప్రసాద్, రత్నకుమారి, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే లాస్య నందిత మృతి పట్ల మంత్రి తుమ్మల తీవ్ర దిగ్భ్రాంతి



**ఖమ్మం సూర్య బ్యూరో** కంటోన్మెంట్ యువ ఎమ్మెల్యే లాస్య నందిత మృతి పట్ల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గతేడాది ఫిబ్రవరిలో కంటోన్మెంట్ సీనియర్ ఎమ్మెల్యే అయినటువంటి తన తండ్రి సాయన్న మృతి నుండి ఇంకా కోలుకొక ముందే, ప్రజా సేవలో ఆయన వారసత్వాన్ని కొనసాగిస్తూ కంటోన్మెంట్ ప్రజల మన్ననలు పొందిన యువ ఎమ్మెల్యే లాస్య నందిత ఆకస్మిక మరణం అత్యంత బాధాకరమన్నారు. ఆమె మరణం కంటోన్మెంట్ ప్రజలకు తీరని లోటని పేర్కొన్నారు,ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని,వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు.వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసారు.

## స్కూల్ బస్ కు ఫిట్నెస్ లేకపోవడమే ప్రమాదానికి కారణం

**పిడిఎస్యు**






**ఖమ్మం సూర్య మేజర్ న్యూస్** ఖమ్మం సిటీలో టేకులపల్లి యూటర్న్ వద్ద కాకతీయ స్కూల్ బస్ ప్రమాదానికి కారణం ఫిట్నెస్ లేకపోవడమేనని పిడిఎస్ యు జిల్లా ప్రధాన కార్యదర్శి వి. వెంకటేష్ ఆరోపించారు. ప్రమాదానికి కారణమైన స్కూల్ బస్ లో ఫైర్ సేఫ్టీ,ఫస్ట్ ఎయిడ్ కిట్స్, మిడిల్ రాడ్స్ లేకుండానే పాత బస్ లకు కొత్త రంగులు వేసి రోడ్డుపై నడిపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. తక్షణమే ఫిట్నెస్ లేకుండా నడిపిన స్కూల్ బస్ ను రవాణా శాఖ డిటీఓ సీజ్ చేయాలని డిమాండ్ చేశారు.స్కూల్ నిర్వహణపై డీఈఓ చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రమాదం లో తలకు గాయమైన స్టూడెంట్ అయాన్ కు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు.

## విద్యుత్ సరఫరా లో అంతరాయం ఏర్పడితే తెలియజేయండి

**ఖమ్మం సూర్య మేజర్ న్యూస్** గృహ,వాణిజ్య విద్యుత్ సరఫరా లో అంతరాయం ఏర్పడితే సంబంధిత విద్యుత్ శాఖ ఆఫీసర్లకు వినియోగదారులు తెలియజేస్తే పరిష్కరిస్తామని ఆశాఖ ఎస్ఈ ఎ. సురేందర్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అవసరానికి మించి విద్యుత్ అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు.విద్యుత్ సమస్య ఉత్పన్నమైతే విద్యుత్ సర్కిల్ ఆఫీస్ కంట్రోల్ రూం నెంబర్ కు 9440 811 525 పిర్యాదు చేయాలని ఎస్ఈ సూచన చేశారు.

# రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

**–జిల్లా కలెక్టర్ ప్రియాంక అల**





కొత్తగూడెం,సూర్య(మేజర్ న్యూస్) – జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక అల అన్నారు. శుక్రవారం కొత్తగూడెం జిల్లా కేంద్ర ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆసుపత్రిలో కలియ తిరుగుతూ వార్డులు పరిశీలించి రోగులతో మాట్లాడారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు గురించి అడిగి





తెలుసుకున్నారు. ఆసుపత్రిలో తొలుత ఎమర్జెన్సీ వార్డును సందర్శించారు. అక్కడి రోగులతో మాట్లాడారు వైద్య సేవలు సరిగ్గా అందుతున్నాయా మందులు ఇస్తున్నారా ఎన్ని రోజులు నుండి ఆసుపత్రిలో ఉన్నారు ఇలాంటి తదితరు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎమర్జెన్సీ వార్డులో డాక్టర్లు రోగులకు అందుబాటులో ఉంటూ రోగులకు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ వైద్య చికిత్సలు అందించేలా చర్యలు తీసుకోవాలని,ప్రభుత్వ ఆసుపత్రులకు పేదవారు వస్తారని, మెరుగైన సేవలు అందించాలని అన్నారు.ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని సదుపాయాలు కల్పిస్తున్నారని, వీటిని ప్రజలు వినియోగించుకొనేలా చూడాలని, ప్రయివేటు ఆసుపత్రులకు వెళ్లి ఆర్థికంగా నష్టపోకుండా అవగాహన కల్పించాలని కలెక్టర్ అన్నారు. అనంతరం ఆర్థోపెడిక్ వార్డ్ మరియు ఇంటెన్సివ్ కేర్ ను సందర్శించి అక్కడ రోగుల నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మెడికల్ స్టోర్, లేబర్ రూములు, ఆపరేషన్ థియేటర్లను పరిశీలించారు.సిబ్బంది హాజరు బయోమెట్రిక్ రికార్డులను పరిశీలించిన ఆమె అలసత్వం వహించిన వైద్యులు, సిబ్బంది పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు, సిబ్బంది హాజరు బయోమెట్రిక్ విధానంలో నూరు శాతం ఉండాలని ఆసుపత్రి సూపర్డెంట్ ను ఆదేశించారు. ఆసుపత్రి అభివృద్ధి పనులు ఎంతవరకు జరిగినవి ఇంకా ఎంతవరకు జరగాల్సినవి సంబంధిత రికార్డులు పరిశీలించారు. ఆర్ అండ్ బి ఈ ఈ వెంకటేశ్వర్లు తో ఆసుపత్రి వెలుపల డ్రైనేజీ నిర్మాణం కు ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు కావలసిన ప్రతిపాదనలు సిద్ధం చేసి నివేదిక సమర్పించాల్సిందిగా ఆదేశించారు. వారం రోజుల్లో ఆస్పత్రిలో ఉన్న పెండింగ్ పనులన్నీ పూర్తి చేయాలని ఆస్పత్రి ఏ ఓ ను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ శిరీష, ఆసుపత్రి ఇంచార్జి సూపర్డెంట్ లక్ష్మణరావు, ఆర్ఎంఓ జిజిహెచ్ డాక్టర్ పుష్పలత, ఆర్ ఎం ఓ ఎం సి హెచ్ రామవరం డాక్టర్ వీరబాబు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సురేందర్ ఆస్పత్రి అన్ని విభాగాల మెడికల్ ఆఫీసర్లు సిబ్బంది పాల్గొన్నారు.

## బ్యాంకు అధికారులతో అవగాహన సదస్సు

**- చిరు ఉద్యోగులు ఆర్థిక అభివృద్ధి వైపు పయనించాలి.**

**- భద్రాచలం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి ప్రతీక్ జైన్..**





భద్రాచలం సూర్య (మేజర్ న్యూస్):భద్రాచలం ఐటిడిఏ గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అది తక్కువ జీతంతో పనిచేస్తున్న ఉద్యోగులకు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ప్రతీక్ జైన్ తమ కార్యాలయము నందు అవగాహన సదస్సు నిర్వహించారు. ఉద్యోగులకు వస్తున్న తక్కువ జీతంతో వివిధ స్కీం లు కట్టి నష్టపోవద్దని సూచించారు. ఐటీడీఏ లో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న యూనిట్ ఆఫీసర్లు, సిబ్బందికి నిపుణులైన బ్యాంకర్స్ /ఇన్వెస్టర్లతో శుక్రవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేసి ఆర్థిక ఆర్థిక బలోపేతం కావడానికి కొన్ని సూచనలు సలహాలు అందించారు... ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీడీఏ కార్యాలయంలో పనిచేయుచున్న ఎక్కువ శాతం మంది ఉద్యోగులు ఉద్యోగ విరమణ అయిన తర్వాత కొందరికి పెన్షన్ కూడా రాని పరిస్థితి ఉందని అందుకు తెలిసి, తెలియకుండ ఎదుటివారి ని నమ్మి రాబడి లేని వాటిలోనూ లాభాలు వస్తున్నాయాని పెట్టుబడి పెట్టి నష్టపోకుండా సొంతంగా అవగాహనతో నష్టం లేకుండా కుటుంబాలకు తోడుగా ఉండే ఆర్థికపరమైన అవగాహన కల్పించుకొని ,సరి అయిన ఆర్థికపరమైన మార్గంలో నడుచుటకు బ్యాంకర్స్/ఇన్వెస్టర్లు వివిధ ఫిక్స్ డిపాజిట్ కి తలసరి ఆదాయం ఎంత వస్తుందో వారి సూచనలను పాటించి ఆర్థిక అభివృద్ధి దిశగా పయనించి తమ కుటుంబాలను పోషించుకోవాలని ఆయన సిబ్బందికి సూచించారు. అనంతరం వివిధ బ్యాంకుల నుండి వచ్చిన బ్యాంకర్స్/ఇన్వెస్టర్లు డబ్బును ఏ విధంగా పొదుపు చేయాలో కాల పరిమితికి సంబంధించిన అంశాలను పవర్ ప్రజెంటేషన్ ద్వారా సిబ్బందికి అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఏపీవో జనరల్ డేవిడ్ రాజ్, ఎస్.ఓ సురేష్ బాబు ,ఏ సి ఎం ఓ రమణయ్య ,ఏటిడిఓ నరసింహారావు , మేనేజర్ ఆదినారాయణ,జేడీఎం హరికృష్ణ,మరియు వివిధ బ్యాంకుల నుండి వచ్చిన ఇన్వెస్టర్లు హేమంత్ ,స్పందన, రమేష్, ముఖేష్, శ్రీనివాస్, ఐటీడీఏ కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సీతంపేట రాఘవపురం రహదారి మంజూరు చేయాలి

**బీఎస్పీ పార్లమెంట్ ఇంచార్జ్ యెర్రా కామేష్**

సుజాతనగర్,సూర్య(మేజర్ న్యూస్)–మండలాపరిధిలోని సీతంపేట ఆంజనేయస్వామి దేవాలయం నుండి రాఘవపురం బీటీ రోడ్డు మంజూరు చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ పార్లమెంట్ ఇంచార్జ్ యెర్రా కామేష్ ప్రభుత్వాన్నీ డిమాండ్ చేశారు.శుక్రవారం సీతంపేట గ్రామంలో పర్యటించి గ్రామస్థులు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు.ఈసందర్భంగా కామేష్ మాట్లాడుతూ సీతంపేట గ్రామం నుండి రాఘవపురం గ్రామానికి రోజు వందలాది మంది రైతులు,ప్రజలు ప్రయాణాలు కొనసాగిస్తుంటారని సరైన రహదారి లేకపోవడం ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని అవేదన వ్యక్తం చేశారు. సీతంపేట,రాఘవపురం గ్రామాలు ఏర్పడి ఆరవై ఏళ్ళు దాటినా నేటికీ రహదారి లేకపోవడం పాలకుల అసమర్థతకు నిదర్శనమన్నారు ప్రతీ నాయకుడు ఎన్నికలప్పుడు హామీ ఇవ్వడం గెలిచాక మర్చిపోవడం పరిపాటిగా మారిందని ఎద్దేవా చేశారు.జిల్లా కలెక్టర్ చొరవ తీసుకుని సీతంపేట రాఘవపురం రహదారి మంజూరు చేయాలని కోరారు.ఈకార్యక్రమంలో సాయి,జిల్లా కార్యదర్శి మాలోత్ వీరు నాయక్,అసెంబ్లీ ఇంచార్జ్ నాగుల రవికుమార్,తడికమల్ల దిలీప్,తాళ్లూరి మోహన్ దాస్,తగరం శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



### సిపిఎం సభ్యులు జానయ్య మృతికి సంతాపం ప్రకటించిన భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు



భద్రాచలం, సూర్య (మేజర్ న్యూస్):–భద్రాచలం పట్టణ అశోక్ నగర్ కొత్తకాలనీ కి చెందిన సిపిఐఎం సీనియర్ సభ్యులు పారెల్లి జానయ్య అనారోగ్యంతో గురువారం మధ్యాహ్నం మృతి చెందారు. విషయం తెలుసుకున్న భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు వెళ్ళి జానయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. సిపిఎం పార్టీ భద్రాచలం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, నాయకులు వెంకటరెడ్డి ,భద్రాచలం బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు అరికెల తిరుపతిరావు, జాయింట్ సెక్రటరీ బొంబోతుల రాజీవ్, యూత్ అధ్యక్షులు గాడి విజయ్, ఉపాధ్యక్షులు పుల్లగిరి నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## పారెల్లి జానయ్య మృతికి సిపిఎం నివాళి



భద్రాచలం సూర్య( మేజర్ న్యూస్):–సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు పారెల్లి జానయ్య అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతదేహంపై పార్టీ జెండాను పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి ఎర్రజెండా కప్పి నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ పట్టణ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి మాట్లాడుతూ, జానయ్య మృతి పార్టీకి, కుటుంబానికి తీరని లోటని అన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.నివాళులు అర్పించిన వారిలో పార్టీ పట్టణ కార్యదర్శి పార్టీ సీనియర్ నాయకులు బిబిజి తిలక్, జిఎస్ శంకర్రావు, జిల్లా కమిటీ సభ్యులు యం.రేణుక, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు బి వెంకటరెడ్డి, బండారు శరత్ బాబు, ఎర్రం శెట్టి వెంకటరామారావు, నాదెళ్ల లీలావతి, నాయకులు పట్టణ కమిటీ సభ్యులు యూత్ జ్యోతి లక్ష్మణ్ కోరాడ. శ్రీనివాస్, తంబల్ల ,కృష్ణార్జునరావు, నకిరేకంటి నాగరాజు, కుంజా శ్రీనివాస్, చుక్క మాధవరావు, కొత్త కాలనీ పార్టీ శాఖ సభ్యులు ఉన్నారు.సంతాపం ప్రకటించిన రాష్ట్ర, జిల్లా నాయకులు జానయ్య మృతి పట్ల పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతునేని సుదర్శన్రావు, డాక్టర్ మిడియం బాబురావు, రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్, అన్నవరపు కనకయ్య మచ్చా వెంకటేశ్వర్లు ఏజే రమేష్, పార్టీ సీనియర్ నాయకులు ఎలమంచి రవికుమార్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి,కే బ్రహ్మాచారి, కారం పుల్లయ్య,లు సంతాపాన్ని తెలియజేశారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## ఢిల్లీ లో యువ రైతు మృతి కి కారణమైన కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దించాలి

**ఇల్లందు టౌన్, సూర్య(మేజర్ న్యూస్).**




గత రెండేళ్ల క్రితం రైతు ఉద్యమానికి తలొగ్గిన నరేంద్ర మోడీ ఇచ్చిన మాట నిలుపుకోని కారణంగా రైతులు మళ్ళీ ఆందోళనలకు పూనుకుంటే వారిపై పోలీసులు రబ్బర్ బుల్లెట్లు, బాష్పవాయువు ప్రయోగిస్తూ రోడ్లపై ఇనుప ముళ్ళ కంచెలు వేసి రైతుల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తున్న మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని సిఐటియు జిల్లా నాయకులు తాళ్లూరు కృష్ణ అన్నారు. శుక్రవారం మోడీ కార్మిక కర్షక రైతు వ్యతిరేక విధానాలను వ్యతిరేకించిన వారిపై పోలీసులు కాల్పులు జరిపి రైతు శుభకరణ సింగ్ మరణించడాన్ని నిరసిస్తూ ఇల్లందు బిల్డింగ్ అడ్డాపై సిఐటియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిపారు.ఫిబ్రవరి 21 న పంజాబ్ ఖన్నోరి సరిహద్దులో పోలీసులు కాల్పులు జరిపారని, ఆ కాల్పులలో భాటిండా జిల్లా బల్లో గ్రామ రైతు చరణ్ జిత్ సింగ్ కుమారుడు యువ రైతు శుబకరన్ సింగ్ పోలీసు కాల్పులలో మరణించిన ఘటనకు కారుకులైన వారిపై కఠిన చర్ల తీసుకోవాలని సందర్భంగా కోరారు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ నరేంద్రమోడీ ప్రభుత్వం కార్మిక కర్షక ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నదని దాన్ని రాబోయే ఎన్నికల్లో ఇంటికి పంపాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం లో కామ నాగరాజు,వెంకన్న,లక్ష్మీ,రాణి, అరుణ, కుమార్, రెడ్డి. తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి విద్యార్థుల పరీక్షలపై దృష్టి సారించండి



**– ఐటీడీఏ ఏపీవో జనరల్.డేవిడ్ రాజ్**

భద్రాచలం సూర్య (మేజర్ న్యూస్):పదవ తరగతి హాజరయ్యే పిల్లలు విద్యార్థుల పరీక్షల పై దృష్టి సారించాలని భద్రాచలం ఐటిడిఏ ఏపీవో జనరల్ డేవిడ్ రాజ్ పేర్కొన్నారు. భద్రాచలం గిరిజన గురుకులంను గురువారం ఆయన సందర్శించి పాఠశాల 10వ తరగతి బాలికలతో ఇంటరాక్ట్ అయ్యారు.ఈ సందర్భంగా ఐటీడీఏ ఏపీవో జనరల్ మాట్లాడుతూ పరీక్షలపై ఉన్న భయాన్ని బాలికలు వీడాలని తగు ప్రణాళికతో చదివితే విజయం మీదేనని టెన్త్ విద్యార్థినులకు భరోసా కల్పించారు. ఉపాధ్యాయులు పిల్లలకు చక్కని తర్ఫీద్ ఇవ్వాలని, పిల్లలు ఒత్తిడికి లోను కాకుండా చూడాలని సూచించారు.సాధన చేస్తే సాధించలేనిది ఏమీ లేదని తెలిపారు. కఠినంగా ఉన్న సబ్జెక్టులపై కాస్త దృష్టి ఎక్కువగా పెట్టాలని తెలిపారు. పరీక్షల సమయంలో పిల్లలు ఆరోగ్యం పట్ల కూడా తగు శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. గిరిజన విద్యా ప్రగతికి ప్రభుత్వం ఐటీడీఏ ద్వారా ఎంతగానో కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను గిరిజన పిల్లలు సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు.ఈ సందర్భంగా ప్రభుత్వం అందచేసిన దుప్పట్లను పాఠశాల బాలికలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం గిరిజన గురుకుల పాఠశాల కళాశాల ప్రిన్సిపాల్ ఎం దేవదాసు, పాఠశాల, కళాశాల టీచర్స్,అధ్యాపకులు, నాన్ టీచింగ్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక ,మట్టి రవాణా చేస్తే కఠిన చర్యలు

**– తాసిల్దార్ ముజాహిద్**



బూర్గంపాడు సూర్య (మేజర్ న్యూస్) మండలంలో ఇసుక ,మట్టి అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకొని క్రిమినల్ ,పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తామని తాసిల్దార్ ముజాహిద్ హెచ్చరించారు. శుక్రవారం మండల రెవెన్యూ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని గోదావరి కిన్నెరసాని ప్రాంతాలలో అక్రమ ఇసుక రవాణాను అరికట్టేందుకు గట్టి నిఘను ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు మండలంలో ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక స్టాక్ పాయింట్ పెట్టిన యెడల సీజ్ చేసి కేసు నమోదు చేస్తామన్నారు. అక్రమ ఇసుక రవాణాను అరికట్టేందుకు ఉప్పుసాక, సోంపల్లి, బుడ్డగూడెం, బూర్గంపాడు ,సారపాక తదితర గ్రామాల ప్రజలు అక్రమ ఇసుక రవాణా చేస్తున్న సమాచారాన్ని అందించాలని కోరారు.ఎటువంటి అనుమతులు లేకుండా అనధికారికంగా ఉన్నటువంటి అక్రమ ఇసుక ర్యాంపులను త్వరలోనే అరికడతామన్నారు. అక్రమ ఇసుక రవాణా చేసే ట్రాక్టర్లు లారీలు పట్టుబడినట్లయితే భారీ జరినామా తోపాటు నెల రోజుల వరకు వదిలిపెట్టేది లేదన్నారు. అదేవిధంగా అక్రమ ఇసుక రవాణా విషయంలో ఎటువంటి పైరవకారులకు అవకాశం లేదని తెలిపారు. సామాన్యులకు ఇసుకను అందించేందుకు జిల్లా అధికారుల దృష్టికి తీసుకుని వెళ్తానని తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ తాసిల్దార్ రామ్ నరేష్ ఆర్ఐలు నరసింహారావు, ముత్తయ్య పాల్గొన్నారు.

## గ్రామాలలో కోడి శ్రీరాములు సంతాప సభలు నిర్వహించండి

**ఇల్లందు టౌన్,సూర్య (మేజర్ న్యూస్).** మండలంలోని మాణిక్యరాం గ్రామంలో ఫిబ్రవరి 29న కోడి శ్రీరాములు సంతాప సభలకు సంతాప సభలకు తరలిరావాలని సిపిఐ ఎంఎల్ నువ్వు డెమోక్రసీ నాయకులు కోరారు. 17.2.2024న రోడ్డు ప్రమాదంలో మరణించిన అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు,రాష్ట్ర నాయకులు కామ్రేడ్ కోడి శ్రీరాములు సంతాప సభలు, ప్రదర్శనలు శుక్రవారం మండల పరిధిలోని ఎల్లాపురం తండా, తొంటబాలుతండ గ్రామాల్లో నిర్వహించారు. మాణిక్యారం సర్పంచ్ మోకాళ్ళ కృష్ణ, బోయతండ సర్పంచ్ బి.సంతు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం-ఎల్)న్యూ డెమోక్రసీ ఇల్లెందు డివిజన్ కార్యదర్శి తుపాకుల నాగేశ్వరరావు, మండల కార్యదర్శి పొడుగు నరసింహారావు, ఐఎఫ్టియు జిల్లా ప్రధానకార్యదర్శి కొక్కు సారంగపాణి పాల్గొని మాట్లాడుతూ ఫిబ్రవరి 29న మాణిక్యారంలో జరుగు కామ్రేడ్ కోడి శ్రీరాములు సంతాప బహిరంగ సభకు రావాలని ప్రజలకు పిలుపునిచారు.



## మార్చి3న, ఖమ్మంలో జరుగు బహిరంగసభను జయప్రదం చేయండి

**షేక్ యాకుబ్ షావలి.**




ఇల్లందు టౌన్,సూర్య (మేజర్ న్యూస్).ఇల్లందు మున్సిపల్ ఫిల్టర్ బెడ్ మస్టర్ అడ్డా వద్ద శుక్రవారం కార్మికుల జనరల్ బాడీసమావేశం జరిగింది. ఈ జనరల్ బాడీలో ఐఎఫ్టియు జిల్లా కార్యదర్శి షేక్ యాకుబ్ షావలి జిల్లా నాయకులు పాయం వెంకన్న పాల్గొని మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం రాజ్యాంగం ద్వారా రాష్ట్రాలకు సంక్రమించిన ఫెడరల్ హక్కుల్ని కాలరాస్తున్నదన్నారు. బిజెపి ఆర్ఎస్ఎస్ సంగ్ పరివార్ శక్తులకు వ్యతిరేకంగా ఉన్న ప్రతిపక్ష పార్టీలను ప్రజాస్వామిక లౌకిక శక్తుల్ని అణచి పెడుతున్నదన్నారు. పార్లమెంటరీ సంస్థలైన సిబిఐ, ఈడి, ఐటి, తదితర సంస్థల ద్వారా దాడులు చేయిస్త దన్నారు.ఈ హిందుత్వ ఫాసిస్టు శక్తులను ఎదుర్కోవాలంటే ఒక అఖిల భారత ఐక్య పార్టీ అవసరం ఎంతైనా ఉందన్నారు. మూడు కమ్యూనిస్టు విప్లవ సంస్థల ఐక్య మహాసభ ద్వార మేము వేస్తున్న ఒక ముందడుగు అన్నారు. భవిష్యత్తులో ఈ ప్రక్రియ మరింత బలపడి ఒక శక్తివంతమైన విప్లవ కమ్యూనిస్టు పార్టీగా ఆవిర్భవిస్తుందన్నారు, ఈ దేశంలో విప్లవం విజయవంతం కోసం సిపిఐ ఎంఎల్ ప్రజా పందా శక్తి వంచన లేకుండా కృషి చేస్తుందన్నారు.ఆ కృషిలో భాగమే మార్చి 4 న పిసిసి సిపిఐ(ఎంఎల్) సిపిఐ (ఎంఎల్ )ఆర్ఐ, సిపిఐ (ఎంఎల్) ప్రజాపందా ఈ మూడు పార్టీల ఐక్యత మహాసభల సందర్భంగా మార్చి-3,న జరిగే భారీ బహిరంగసభ ప్రదర్శనను జయప్రదం చేయాలని విప్లవ అభిమానులకు ప్రజలకు కార్మికులకు కర్షకులకు మేధావులకు పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో జిల్లా కమిటీ నాయకులు వేముల గురునాథం,కే వీరన్న, మున్సిపల్ యూనియన్ నాయకులు దుర్గం మహేష్, కొండా ప్రకాష్,నందు,సురేష్,, సంజీవ్,రవి ,జానీ మియా, ఉపేందర్ పాల్గొన్నారు.

## అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



లక్ష్మీదేవిపల్లి,సూర్య(మేజర్ న్యూస్) మండలం పునుకుడుచిలక గ్రామపంచాయతీ తోక బంధాల గ్రామానికి చెందిన గోప చలపతిరావు(23) పాల్వంచలో పీజీ చేస్తున్నట్టు సమాచారం. ఈ నెల 22వ తేదీ గురువారం రాత్రి మైలారం గ్రామపంచాయతీలో జరుగుతున్న సమ్మక్క సారక్క జాతర దగ్గరకు వెళ్తున్నానని చెప్పి స్నేహితులతో కలిసి ఇంట్లో నుంచి వెళ్ళాడు. మరుసటి రోజు ఉదయం మైలారం గ్రామ శివారు ప్రాంతంలో చెట్టు కింద గాయాలతో శవమై పడి ఉన్నాడు. పక్కనే తన ద్విచక్ర వాహనం పార్కింగ్ చేసి అందులో తన చెప్పులు ఉన్నాయి. పక్కనే మద్యం సేవించిన బాటిల్లు కూడా ఉండటం ఒంటిపై గాయాలు ఇవన్నీ చూసిన గ్రామస్తులు పలు రకాలుగా చర్చించుకుంటున్నారు.ఎవరో కొట్టి చంపేసి అక్కడ పడేసి వెళ్లి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. విషయం తెలుసుకున్న లక్ష్మీదేవిపల్లి ఎస్ఐ రమణారెడ్డి, వన్ టౌన్ సిఐ కరుణాకర్ సంఘటన స్థలానికి చేరుకొని ఘటన స్థలాన్ని పరిశీలించి బాడీని పోస్టుమార్టం నిమిత్తం కొత్తగూడెం ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ కి తరలించి మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టారు. త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఎస్సై రమణారెడ్డి తెలిపారు.

## కొత్తగూడెం పురోభివృద్ధికి ఆటంకంగా సింగరేణి నిర్ణయాలు

**–సిఐటీయూ**



కొత్తగూడెం సింగరేణి,సూర్య(మేజర్ న్యూస్) – సింగరేణి బొగ్గు గనులతో విరాజిల్లుతున్న కొత్తగూడెం ఏరియా పురోభివృద్ధికి ఆటంకంగా మారుతున్న సింగరేణి యాజమాన్యం నిర్ణయాలు చేస్తుందని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ - సిఐటియూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నరసింహారావు పేర్కొన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన పిట్ మీటింగ్ లో నరసింహారావు మాట్లాడుతూ దాదాపు 50 సంవత్సరాలుగా వి.కే-7 షాఫ్ట్ మూడు వేల పైచిలుకు కార్మికులు సింగరేణిలోనే అతిపెద్ద మైన్ గా పేరొందిందని అన్నారు. ప్రక్కనే ఉన్న గౌతంఖని ఓపెన్ కాస్ట్ లో ఏడు వందల పైచిలుకు కార్మికులు 25 సంవత్సరాలకు పైగా సింగరేణిలోనే అధిక ఉత్పత్తి ఉత్పాదకతతో ఒక వెలుగు వెలుగుతున్న కొత్తగూడెం ఏరియా కు కారుమబ్బులు కమ్ముతున్నాయని పేర్కొన్నారు. గౌతంఖని ఓపెన్ కాస్ట్ విస్తరణ లో భాగంగా, వికే-7 షాఫ్ట్ ను ఓపెన్ కాస్ట్ గా మార్పు చేయుటకు సింగరేణి యాజమాన్యం పబ్లిక్ హియరింగ్ నిర్వహించి, ఇక్కడ పనిచేస్తున్న కార్మికులను సర్దుబాటు క్రమంలో డిప్యూటేషన్ పై ఓవిఆర్ ఓసికి, మణుగూరు ఏరియా ట్రాన్స్ఫర్ చేశారు. వికే-7 ఓపెన్ కాస్ట్ అనుమతుల అనంతం మరల కార్మికులను తిరిగి తీసుకుంటామని యాజమాన్యం తెలిపిందని అన్నారు. కాలక్రమేణా జరుగుతున్నదేంటి సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించాల్సిన ఓపెన్ కాస్ట్ ను సొధా, సుశీల్ అనే బడా కాంట్రాక్టర్ల కు అప్పగించనున్నదని తెలియవచ్చింది. ఇలా జరుగుతే పర్మినెంట్ కార్మికుల సంఖ్య మరింత తగ్గే అవకాశం ఉందని, తిరిగి తీసుకుంటామని ఇచ్చిన హామీ బుట్టదాఖలే అని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి ఆధ్వర్యంలో నడిపించుకు కార్మికులు పోరాటానికి సిద్ధంగా ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బ్రాంచి కార్యదర్శి విజయగిరి శ్రీనివాస్, కొత్తపల్లి రమేష్ బాబు పాల్గొన్నారు.

## సమ్మక్క సారలమ్మను దర్శించుకున్న రజాక్



కొత్తగూడెం సింగరేణి,సూర్య(మేజర్ న్యూస్) రామవరం గరిపేట లోని సమ్మక్క సారక్క జాతరకు ఐఎన్టియుసి వైస్ ప్రెసిడెంట్ ఎండి రజాక్ ఐఎన్టియుసి నాయకులతో కలిసి సందర్శించడం జరిగింది, రజాక్ మాట్లాడుతూ సమ్మక్క సారక్క జాతరలో మూడు రోజుల నుండి ప్రజలు భారీ స్థాయిలో తరలివచ్చి భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమంలో పాల్గొంటూన్నారు ప్రతి ఒక్కరికి మంచి జరగాలని వారు కోరుకున్న కోరికలన్నీ విజయవంతం కావాలని, ఈ సందర్భం గా వారు తెలియజేశారు నాయకులు, ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఎండి రజాక్, గుడి నిర్వాహకులు కామిశెట్టి కొండలరావు, శాంతాదేవి, సాయి రాజ్, మల్లారపు కొమురయ్య, కొండల్, సన్నీ, పాష, టింకు, భక్తులు, మిత్రులు శ్రేయోభిలాషులు, ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మాజీ ఐఏఎస్ జన్నత హుస్సేన్ మృతి

**–సంతాపం వ్యక్తం చేసిన రాష్ట్రా మైనారిటీ నాయకులు నయీమ్ ఖురేషి**



కొత్తగూడెం టౌన్,సూర్య(మేజర్ న్యూస్) –మాజీ ఐఏఎస్ జన్నత హుస్సేన్ మృతి పట్ల రాష్ట్రా మైనారిటీ నాయకులు నయీమ్ ఖురేషి సంతాపం వ్యక్తం చేశారు.నిజాయితీ, అంకితభావం, నిబద్ధత , సింప్లిసిటీకి,దాతృత్వానికి నిలువెత్తు ఉదాహరణ. వృత్తి ధర్మాన్ని విలువనిచ్చే గొప్ప వ్యక్తి. ముఖ్యంగా పేద ప్రజల గొంతుక ఆయన. గత కొన్ని సంవత్సరాలుగా అల్జీమర్స్ వ్యాధితో బాధపడుతున్నారు శుక్రవారం ఉదయం సూళ్లూరుపేట. నెల్లూరు జిల్లాలో కన్నుమూశారని తెలిపారు. ముస్లింలలో 4% రిజర్వేషన్లు కల్పించడంలో ఆయన చేసిన సేవలు మరువలేనివి . 2004 నుండి 2009 వరకు వై ఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ఆయన చేసిన సేవలు మరువలేనివి. స్వర్గీయ జన్నత్ హుసేన్ మగ్ఫిరత్ కోసం ప్రత్యేక దువాలు చేయండని కోరారు.

# వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



## పంటలను పరిశీలించి వ్యవసాయాధికారి

సింగరేణి సూర్య మేజర్ న్యూస్ సింగరేణి(కారేపల్లి ఫిబ్రవరి23)మండలం కోటిలింగాల కట్టు క్రింద సాగు చేస్తున్న వరి పంటకు కాండం తొలుచు ఉధృతి పై మండల వ్యవసాయాధికారి కె.ఉమామహేశ్వర్‌రెడ్డి రైతులను సూచనలు చేశారు. శుక్రవారం వరి పంటను పరిశీలించి రైతులతో మాట్లాడారు. వరిలో కాండం తొలుచు పురుగు ఆశించి వరి దుబ్బలు, పిలకులు, ఆకు ఎండి పోయి సులువుగా ఊడి వస్తుందన్నారు. రైతులు పురుగు నివారణకు కార్‌టాప్ హైడ్రోక్లోరైడ్ పొడిని ఎకరాకు 400గ్రాము చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి 10 రోజుల వ్యవధిలో రెండ సార్లు పిచికారి చేసుకోవాలని సూచించారు. వరిలో జింకు లోపంతో ఆకులు ఇటుక రంగు మచ్చలు తప్పురంగు మచ్చలు ఏర్పాడ్డాయన్నారు. దాని నివారణకు ఎకరాకు జింక్ సల్ఫేట్ 200 గ్రాములను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలన్నారు.రైతులు పంటలను పరిశీలించి ఎప్పటి కప్పుడు సస్యరక్షణ చర్యలు చేపట్టం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చాన్నారు. ఏవో వెంట ఏఈవో ప్రమీల, రైతులు ఉన్నారు.

## సిసి రోడ్ల మంజూరుకై ఎమ్మెల్యేకు వినతి పత్రం



సుజాతనగర్ సూర్య(మేజర్ న్యూస్)సుజాతనగర్ మండలంలోని గొల్లగూడెం గ్రామంలో ఉన్న మట్టి రోడ్లను సిసి రోడ్లుగా మంజూరు చేయాలని గ్రామస్తులు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు వెంటనే స్పందించి పంచాయతీరాజ్ డిఈ కి ఫోన్లో సంప్రదించి గొల్లగూడెం గ్రామానికి సిసి రోడ్ల మంజూరుకు ప్రతిపాదనలు పంపి పూర్తిచేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో గొల్లగూడెం గ్రామస్తులు వీర్ల మల్లేష్, వీర్ల దుర్గాప్రసాద్, మేకల వెంకటేష్, వీర్ల లింగేష్, సత్యనారాయణ, కశన బోయిన వెంకన్న, మేకల ప్రవీణ్ కుమార్,శివకృష్ణ,కాసాల వెంకటనారాయణ, కాట్రావుల రాజేష్, రసాల వెంకటనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## గుక్కెడు నీటి కోసం... బండెడు కష్టాలు



**టేకులపల్లి సూర్య (మేజర్ న్యూస్):** మండలంలోని సులానగర్ గ్రామ స్థులు గుక్కెడు నీటి కోసం బండెడు కష్టాలు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. సులానగర్ లోని బోడ బజార్ , హనుమాన్ గుడి బజార్ లో ఉన్న తాగునీటి బోరు నెలరోజుల క్రితం నీటి పథకం మోటారు పాడైందని, గ్రామంలో ఉన్న ఒక్క చేతి బోరే వీరికి ఆధారంగా ఉందన్నారు . వేకు జాము నుంచి నిరీక్షిస్తే తప్ప, బిందెడు నీరు దొరకడం లేదని మహిళలు వాపో తున్నారు. గతంలో ఈ చేతి బోరు నీరు ఎక్కువ రోజులు వాడుకంలో లేదని, నీరు బురద రూపంలో నీరు బయటకు వస్తుందని , గత్యంతరం లేక ఈ నీటినే వాడుతున్నామని గ్రామస్థులు తెలిపారు. గ్రామంలో ప్రజలు నీటి కోసం తీవ్ర ఇబ్బంది పడుతున్నామన్నారు. ఉన్న నీటి బోరు పాడైపోయి మిషన్ భగీరథ నీరు రావట్లేదని గ్రామస్తులు వాపోతున్నారు.తమ గ్రామంలో నెలకొన్న నీటి సమస్యను వెంటనే సంబంధిత అధికారులు పరిష్కరించాలని ప్రజలు కోరారు. తాము కష్టాలలో ఉంటే పట్టించుకునే నాథుడే కరువయ్యాడన్నారు.ఇంటింటికి శుద్ధజలం అందించాలన్న ప్రభుత్వ ఆశయం సులానగర్ గ్రామంలో అమలు కాలేదు అన్నారు. వేసవి ప్రారంభం కావడంతో భగీరథ నీరు రాకపోతే పరిస్థితి మరింత తీవ్రతరమవుతుందని ప్రజలు ఆందోళన చెందుతున్నట్టు తెలిపారు.



## శ్రీసంత్ సేవాలాల్ ఆశయాలను కొనసాగించాలి

### -జడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత



బూర్గంపాడు, సూర్య (మేజర్ న్యూస్)-లంబాడాల ఆరాధ్యుడు శ్రీసంత్ సేవాలాల్ మహరాజ్ ఆశయాలను కొనసాగించాలని జడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత అన్నారు. శుక్రవారం సారపాక గాంధీనగర్ సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సంత్ సేవాలాల్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీతో పాటు నిర్వాహకులు, అతిథులు గోపిరెడ్డి రమణారెడ్డి, జలగం జగదీష్, పాకాల దుర్గాప్రసాద్, కనకమేడల హరిప్రసాద్,సానికొమ్ము శంకర్ రెడ్డి కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో జడ్పీటీసీ మాట్లాడుతూ సేవాలాల్ మహరాజ్ చిన్నతనం నుంచి సేవాగుణ సంపన్నుడని, దేశవ్యాప్తంగా ఉన్న రూ.10కోట్ల బంజారాలు ప్రతి ఏటా ఫిబ్రవరి 15 నుంచి ఫిబ్రవరి 28వరకు జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారన్నారు. సంత్ సేవాలాల్ జయంతిని అధికారిక సెలవుదినంగా జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. సేవాలాల్ ఆనాడు చేసిన ఉద్యమాలే నేటి అభివృద్ధి ఫలాలు అని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో దుగ్గెంపూడి కృష్ణారెడ్డి, ముప్వా వెంకటేశ్వరరావు(లడ్డా), పేరాల శ్రీను, సేవాలాల్ సేన రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు బానోతు హుస్సేన్ నాయక్, తండా నాయక్ కిషన్, బి. బాప్సింగ్, కార్బారి ఎల్.రాజు, మాజీ ఎంపీటీసీ బీమ్లా నాయక్, గ్రామపెద్దలు రాంజీ, భద్రు, హనుమాన్ నాయక్, ఉత్సవకమిటీ సభ్యులు అజ్మీరా వెంకన్న, జి.రాంబాబు, కృష్ణకుమార్, ఎ.కిషన్, బీమ, చిరంజీవి, బి.రాయుడు, రఘు,బాలకృష్ణ, శేఖర్, హరి, హేమ్లా, రమేష్, కిషన్, హథీరామ్, వెంకటరమణ, బిచ్చు, కార్తీక్, భద్రు,నరేష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

### ఎంపీ వద్దిరాజుకు శుభాకాంక్షలు తెలిపిన మద్దెల సుధీర్ కుమార్



కొత్తగూడెం,సూర్య (మేజర్ న్యూస్ ) రాజ్యసభ ఎంపిగా బీఆర్ఎస్ పార్టీ తరపున ఏకగ్రీవంగా ఎన్నికైన వద్దిరాజు రవిచంద్రకు కొత్తగూడెం బీఆర్ఎస్ యువజన నాయకులు మద్దెల సుధీర్ కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని నివాసంలో ఎంపిని కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి.. శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు చెప్పారు. ఈ సందర్భంగా మద్దెల సుధీర్ కుమార్ మాట్లాడుతు వద్దిరాజు రెండోసారి రాజ్యసభ సభ్యుడిగా ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. రవిచంద్రకు రెండోసారి రాజ్యసభ సభ్యుడిగా అవకాశం కల్పించిన బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. వద్దిరాజు రవిచంద్ర తన పదవీ కాలంలో ప్రజా సమస్యలపై తన వాణిని బలంగా వినిపించారని, పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడంతో పాటు మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కొత్తగూడెం అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు గెలుపు కోసం విశేష కృషి చేసారన్నారు. వద్దిరాజు నాయకత్వంలో కలిసికట్టుగా పనిచేసి ఖమ్మం పార్లమెంట్ స్థానాన్ని గెలిచి కెసిఆర్ కు బహుమతిగా ఇస్తామన్నారు.

## మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే



టేకులపల్లి , సూర్య (మేజర్ న్యూస్) -ఇల్లందు కొత్తగూడెం ప్రధాన రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గురువారం మృతి చెందిన యువకుల కుటుంబాలను ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య శుక్రవారం పరామర్శించినట్లు తెలిపారు. టేకులపల్లి మండలం ప్రేగళ్ళపాడు గ్రామ పంచాయితీ లోని ముత్యాలంపాడు గ్రామానికి చెందిన మోకాళ్ళ భద్రం,వాసం సాయిలు నిన్న రోళ్ళపాడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మృతుల కుటుంబ సభ్యుల ఇంటికి వెళ్ళి పరామర్శించి, ఓదార్చారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ సర్పంచ్ కణితి రమాదేవి,కోరం సురేందర్, లక్కినేని మురళి, ముచ్చ సుధాకర్, జినకల రాజు, తాటి నగేష్,గోవర్ధన్, సురేష్, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి చేయూత

టేకులపల్లి, సూర్య (మేజర్ న్యూస్) – ఈనెల 13న టేకులపల్లి మండలంలోని సులానగర్ గ్రామపంచాయతీలో గ్రామపంచాయతీ పంప్ ఆపరేటర్ గుండెపోటుతో మరణించిన పాసిని భద్రగిరి కుటుంబానికి గ్రామస్తులు చేయూత నిచ్చినట్లు శుక్రవారం తెలిపారు. సులానగర్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ కార్యకర్తలు, ఇంటికి వెళ్లి పరామర్శించి 100 కేజీల బియ్యం అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు .గత రెండు సంవత్సరాల నుంచి పేద కుటుంబం చెందిన వారు ఎవరు చనిపోయిన గ్రామంలో ఇలాంటి కార్యక్రమాలు చేస్తున్నమని ,పేద కుటుంబానికి ఆర్థిక సాయం చేసినందుకు మాకు ఎంతో తృప్తిగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలోమాజీ ఉప సర్పంచ్ ఉండేటి బసవయ్య , కుమ్మరి కిరణ్ కుమార్, బల్లెం బిక్షం , కుమ్మరి చౌదరి , కొట్టే సురేష్ , బొడ్డు రాము పృధ్వి కాలే సుందర్ , కాలే వంశీ పాల్గొన్నారు.



# సమ్మక్క, సారలమ్మల పోరాటం స్ఫూర్తిదాయకం

**-గ్రామాల్లో జాతర సందడి నెలకొంటోంది**
**- శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు**



కొత్తగూడెం,సూర్య(మేజర్ న్యూస్) – నాటి రాచరిక పాలనపై వీర వనితలు సమ్మక్క, సారలమ్మ చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం పట్టణం, చుంచుపల్లి, లక్ష్మీ దేవిపల్లి, సుజాతనగర్ మండలాల పరిధిలోని రామాటాకీస్ ఏరియా, గౌతంపూర్, 2 ఇంక్లైన్, గరీబపేట, లక్ష్మీ దేవిపల్లి, పులిగుండం తదితర ప్రాంతాల్లో జరుగుతున్న సమ్మక్క, సారలమ్మ జాతర ప్రదేశాలను శుక్రవారం సందర్శించి ఉత్సవాల్లో పాల్గొన్నారు. భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ జాతరల్లో మతసామరస్యం వెల్లివిరుస్తోందని, కులమతాలకతీతంగా ఉత్సవాల్లో పాల్గొని దేవతామూర్తుల గద్దెలు, దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించడం శుభపరిణామమన్నారు. వ్యయప్రయాసలకోడ్చి ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తూ అన్నివర్గాల ప్రాణాలను ఏకతాటిపైకి తీసుకురావడానికి కృషి చేస్తున్న ఉత్సవ కమిటీలను ఆయన అభినందించారు. కార్యక్రమాల్లో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె.సాబీర్ పాషా, జిల్లా కార్యవర్గ సభ్యులు బందెల నర్సయ్య, బందెల నర్సయ్య, సలిగంటి శ్రీనివాస్, వి.మల్లికార్జున్ రావు, జి.వీరస్వామి, కంచర్ల జమలయ్య, ఎస్ కె.ఫహీమ్, నూనావత్ గోవిందు, గుగులోత్ నగేష్, తోట రాజు, అంకూస్, ఖాయ్యూమ్, బిక్షపతి, ఉపేందర్, యు. హరీష్, సపావట్ రవి, గుత్తుల శ్రీనివాస్, మిర్యాల రాము తదితరులు పాల్గొన్నారు.

# కాస్త మా గ్రామం వైపు చూడండి

**– రహదారులు వచ్చాయని ప్రకటన చేస్తున్నారు**
**– రహదారులు మాత్రం లేవు.**
**-సొంత ఖర్చులతో రోడ్డు వేసుకుంటున్న సుందరయ్య నగరం గిరిజన వాసులు**



పినపాక ,సూర్య (మేజర్ న్యూస్ ) – పినపాక మండలం జానంపేట గ్రామపంచాయతీ పరిధిలోని సుందరయ్య నగరం గిరిజన గ్రామంలో సుమారు 70 కుటుంబాల వారు గత 30 ఏళ్లుగా ఎటువంటి రోడ్డు సౌకర్యం లేకుండా జీవిస్తున్నట్లు గ్రామ పెద్ద మడివి రమేష్ తెలిపారు. ప్రభుత్వాలు మారిన తమ గ్రామ అభివృద్ధికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామాన్ని పట్టించుకున్న నాధుడే కరువయ్యారని ఆరోపించారు. తమ గ్రామం లో గిరిజనులు జీవిస్తున్నప్పటికీ ఐటిడిఎ
అధికారులు కానీ ఓట్లు వేసి గెలిపించిన ప్రభుత్వాలు గాని తమ గ్రామానికి నిధులు కేటాయించలేదన్నారు. తమ గ్రామాన్ని అభివృద్ధి పరచడంలో వివక్షత చూపించారని అన్నారుఎం ఎన్నిసార్లు సంబంధిత అధికారులకు మొరపెట్టుకున్నప్పటికీ తమ గోడు వినిపించుకునే నాధుడు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్లు నిధులు మంజూరు చేసామని చెపుతున్నారు కానీ రోడ్డు వేయకుండా ఆ నిధులు ఏమయ్యాయో ప్రశ్నార్థకంగా ఉందని ఆరోపించారు.ఎవరో వస్తారు అభివృద్ధి చేస్తారని ఎదురు చూడకుండా రోడ్లు తమ సొంత ఖర్చులతో ఇంటింటికి డబ్బులు వసూలు చేసి తమ గ్రామానికి రోడ్డు వేసుకుంటున్నట్లు మడివి రమేష్ తెలిపారు. వెయ్యని రోడ్లకు కూడా బిల్లు చేసుకుంటున్నా ప్రస్తుత సమాజంలో తమ గ్రామాన్ని పంచాయతీ గాని ,మండల అధికారులు కానీ జిల్లా అధికారులు కానీ పట్టించుకునే వారు లేకపోవడంతో తమ గ్రామ అభివృద్ధి అగమ్య గోచరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ గ్రామ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సుందర నగరం గ్రామస్తులు కుంజా ఆదయ్య, సోడి గంగయ్య, మడివి దెవయ్య, కుర్సం లక్ష్మయ్య, సోడి రామయ్య, గ్రామస్తులు .

# నేటి నుండి విజయభవాని అమ్మవారి జాతర

### ఐదు రోజుల జాతర నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

### 28న అన్నదానం

**అశ్వారావుపేట టౌన్, మేజర్‌న్యూస్** మండల పరిధిలోని నారంవారిగూడెం కాలనీలో వేంచేసి ఉన్న శ్రీ మేల్‌మరవర్తూర్ ఆదిపరాశక్తి విజయ భవాని అమ్మవారి 18వ వార్షిక జాతర మహెూత్సవం నేటి నుండి ప్రారంభం కానుంది. 24వ తేదీ నుండి 28వ తేదీ వరకూ ఐదు రోజుల పాటు జాతర మహెూత్సవాలను పురస్కరించుకొని నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయ నిర్మాణ, ధర్మకర్తలు గేదెల విష్ణుమూర్తి–సరోజిని, ఆనంద్‌కుమార్–కళావతి, సురేష్ నాయుడు–పార్వతి దంపతుల ఆధ్వర్యంలో పురోహితులు మేడూరి సాంబశివప్రసాద్ శర్మల ఆధ్వర్యంలో నిత్య పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రతీ రోజు అమ్మవారికి విశేషమైన పూజా కార్యక్రమాలు, సహస్ర నామార్చనలు, కుంకుమ పూజలు, అభిషేకాలు, ప్రతీ రోజు రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. 28వ తేదీన అమ్మవారి సన్నిధిలో భక్తులు అన్నదాన కార్యక్రమం ఉంటుందని భక్తులు జాతర వేడుకల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని జాతర నిర్వహణ కమిటీ కోరింది.

# జతర దుకాణాల నిర్వహణకై

### చిలకలగండి ఆలయంలో 29న వేలంపాట

**అశ్వారావుపేట రూరల్, మేజర్‌న్యూస్**

మండల పరిధిలోని వినాయకపురం గ్రామ శివారులో వేంచేసి ఉన్న శ్రీ చిలకలగండి ముత్యాలమ్మ తల్లి దేవస్థానంలో జరుగు జాతర పురస్కరించుకొని దుకాణాల నిర్వహణకు ఈనెల 29న వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి బి సూర్యప్రకాష్ రావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. చిలకలగండి దేవాలయంలో ఏప్రిల్ 5వ తేదీ నుండి 9వ తేదీ వరకూ ఐదు రోజుల పాటు జాతర మహెూత్సవం జరుగుతుందని ఇందుకు గాను 5వ తేదీ నుండి 11వ తేదీ వరకూ ఏడు రోజుల పాటు జాతరలో కొబ్బరి కాయలు, పూజా సామగ్రి అమ్ముకొనుటకు, కొబ్బరిచిప్పలు ప్రోగు చేసుకొనుటకు, ఐస్‌క్రీమ్‌కూల్‌డ్రింక్ అమ్ము కొనుటకు, లడ్డూ పులిహెూర ప్రసాదం అమ్ముకొనుటకు గాను దేవాదాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఏడు రోజుల కాలపరిమితికి జరుగు ఈ వేలం పాటకు గాను ముందుగా ధరావత్ సొమ్ము చెల్లించి ఈనెల 29 గురువారం మధ్యాహ్నం 12–30కు జరుగు వేలంపాటలో ఆసక్తి గల వారు పాల్గొనాలని, దేవాదాయ శాఖ నిబంధనల మేరకు వేలంపాట జరుగుతుందని తెలిపారు.

# దేశం మొత్తానికి ఒకే రూల్ వర్తింప చేయాలి

### ఒక్క రోజు గ్రామీణ బ్యాంకుల సమ్మె



కొత్తగూడెం టౌన్,సూర్య(మేజర్ న్యూస్) – గ్రామీణ బ్యాంకు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, దేశం మొత్తానికి ఒకే నేషనల్ రూరల్ బ్యాంకు అఫ్ ఇండియా గా ఒక్కతాటి మీదికి తేవాలని, బ్యాంకు ఉద్యోగుల ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆల్ ఇండియా రీజినల్ రూరల్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ పిలుపు మేరకు ఏపీజీవీబీ రీజినల్ ఆఫీస్ ముందు సమ్మె చేశారు. శుక్రవారం రాష్ట్ర కమిటీ పిలుపుల భాగంగా కొత్తగూడెం లో గ్రామీణ బ్యాంకు ఉద్యోగులు ఒక రోజు సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్యాంకు కార్యాలయం ముందు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు. పెద్దపెట్టున సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆఫీసర్స్ రీజినల్ సెక్రటరీ గోవర్ధన్, అసిస్టెంట్ రీజనల్ సెక్రటరీ జలంధర్, ఎంప్లాయిస్ రీజినల్ సెక్రెటరీ విద్యాసాగర్ అసిస్టెంట్ సెక్రటరీ మాలోత్ కృష్ణ పాల్గొని మాట్లాడారు. దేశం మొత్తానికి ఒకే నేషనల్ రూరల్ బ్యాంకు అఫ్ ఇండియా(ఎన్ ఆర్ బీఐ) గా ఒక్కతటికి తేవాలని, ప్రమోషన్ రూల్స్ ని వెంటనే రివైజ్ చేయడం, ఖాళీగా ఉన్న 30 వేల ఉద్యోగాలను వెంటనే రిక్యూరిమెంట్ చేయాలని, సర్వీస్ రూల్స్ ని మార్చుడం, డైలీ వేజ్ వర్కర్స్ ని పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాలలో కోడి శ్రీరాములు సంతాప సభలు నిర్వహించండి



**ఇల్లందు టౌన్,సూర్య (మేజర్ న్యూస్).**

మండలంలోని మాణిక్యరాం గ్రామంలో ఫిబ్రవరి 29న కోడి శ్రీరాములు సంతాప సభలకు సంతాప సభలకు తరలిరావాలని సిపిఐ ఎంఎల్ నువ్వు డెమోక్రసీ నాయకులు కోరారు. 17.2.2024న రోడ్డు ప్రమాదంలో మరణించిన అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు,రాష్ట్ర నాయకులు కామ్రేడ్ కోడి శ్రీరాములు సంతాప సభలు, ప్రదర్శనలు శుక్రవారం మండల పరిధిలోని ఎల్లాపురం తండా, తొంటబాలుతండ గ్రామాల్లో నిర్వహించారు. మాణిక్యారం సర్పంచ్ మోకాళ్ళ కృష్ణ, బోయతండ సర్పంచ్ బి.సంతు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం–ఎల్)న్యూ డెమోక్రసీ ఇల్లెందు డివిజన్ కార్యదర్శి తుపాకుల నాగేశ్వరరావు, మండల కార్యదర్శి పొడుగు నరసింహారావు, ఐఎఫ్టియు జిల్లా ప్రధానకార్యదర్శి కొక్కు సారంగపాణి పాల్గొని మాట్లాడుతూ ఫిబ్రవరి 29న మాణిక్యారంలో జరుగు కామ్రేడ్ కోడి శ్రీరాములు సంతాప బహిరంగ సభకు రావాలని ప్రజలకు పిలుపునిచారు.

## ఎమ్మెల్యే లాస్య నందిత మృతి బీఆర్ఎస్ కు తీరని లోటు

**ఎమ్మెల్యే మృతికి ఎంపీ నామ సంతాపం**



**ఖమ్మం సూర్య ప్రతినిధి :** సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గ యువ ఎమ్మెల్యే లాస్య నందిత అకాల మృతి మృతి పట్ల బీఆర్ఎస్ లోక్ సభా పక్ష నేత, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసి, సంతాపం తెలిపారు. గతేడాది ఫిబ్రవరిలో కంటోన్మెంట్ సీనియర్ ఎమ్మెల్యే అయిన తన తండ్రి సాయన్న మృతి నుండి ఇంకా కోలుకొక ముందే లాస్య మృత్యువాత పడటం ఎంతో బాధ కలిగిస్తుందన్నారు. ప్రజా సేవలో సాయన్న వారసత్వాన్ని కొనసాగిస్తూ కంటోన్మెంట్ ప్రజల మన్ననలు పొందిన లాస్య నందిత ఆకస్మిక మరణం అత్యంత బాధాకరమన్నారు. పిన్న వయసులోనే ఎమ్మెల్యే గా గెలిచి రాజకీయంగా ఎదుగు తున్న లాస్యను రోడ్డు ప్రమాద రూపంలో మృత్యువు కబలించడం దురదృష్ట కరమన్నారు. వారి కుటుంబా నికి పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఆమె మరణం కంటోన్మెంట్ ప్రజలకు, బీఆర్ ఎస్ పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. ఆమె మృతికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు మనో ధైర్యాన్ని ప్రసాదించాలని నామ ప్రార్థించి, భరోసా ఇచ్చారు.

## ఎమ్మెల్యే లాస్య నందిత మృతి పట్ల మాజి మంత్రి పువ్వాడ దిగ్భ్రాంతి



**ఖమ్మం సూర్య ప్రతినిధి :**కంటోన్మెంట్ యువ ఎమ్మెల్యే లాస్య నందిత మృతి పట్ల మాజీ మాజి మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గతేడాది ఫిబ్రవరిలో కంటోన్మెంట్ సీనియర్ ఎమ్మెల్యే అయిన తన తండ్రి సాయన్న మృతి నుండి ఇంకా కోలుకొక ముందే, ప్రజా సేవలో ఆయన వారసత్వాన్ని కొనసాగిస్తూ కంటోన్మెంట్ ప్రజల మన్ననలు పొందిన యువ ఎమ్మెల్యే లాస్య నందిత ఆకస్మిక మరణం అత్యంత బాధాకరమన్నారు. ఆమె మరణం కంటోన్మెంట్ ప్రజలకు, బిఆర్ఎస్ పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు.

## బిఆర్ఎస్ యువ ఎమ్మెల్యే లాస్య నందిత మృతి అత్యంత బాధాకరం

**ఎమ్మెల్సీ తాతా మధు**



**ఖమ్మం సూర్య మేజర్ న్యూస్ :** సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందిత అకాల మృతి పట్ల ఎమ్మెల్సీ, బిఆర్ఎస్ పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు తాతా మధుసూధన్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. తన తండ్రి మాజీ ఎమ్మెల్యే శ్రీ సాయన్న మృతితో ఆయన ఆశయ సాధనకోసం అతి పిన్న వయస్సులో ఎమ్మెల్యే గా ఎన్నికై అందరి మన్ననలు పొందుతున్న లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం అత్యంత బాధాకరమయిన విషయం. సంవత్సరం క్రితం పెద్దలు శ్రీ సాయన్న మరణం, ఇప్పుడు ఆయన కూతురు నందిత అకాల మృత్యువుకు లోనుకావడం విచారకరమని యమ్మెల్సీ తాతా మధు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.శోకతప్తులైన లాస్య నందిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్సీ తాతా మధు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మరణించిన లాస్య నందిత ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకున్నారు.

# నేను ఆడిందే ఆట, నేను పాటిందే పాట..???

**భూ కబ్జాదారుని పై చర్యలేవి ???**

**స్మశాన వాటిక, ముస్లిమ్స్ స్మశాన వాటిక,**

**చెరువు శిఖంలో భూమి ఏమాయే-???**

**గ్రామస్తుల ఆవేదన.....**



**కూసుమంచి సూర్య మేజర్ న్యూస్. :**మండల పరిధి చేగొమ్మ గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు కొండపర్తి సురేష్, నర్రా సీతారాములు ,మాజీ గ్రామ సర్పంచ్ రెడ్డిమల్ల వెంకన్నల ,ఆధ్వర్యంలో మీడియా సమావేశం వారు ఏర్పాటు చేయటం జరిగింది. అనంతరం వారు మీడియాతో వారు మాట్లాడుతూ ,గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో పాలేరు మాజీ శాసనసభ్యులు కందాల ఉపేందర్ రెడ్డి ప్రధాన అనుచరులు చేగొమ్మ గ్రామానికి చెందిన జిల్లా బిఆర్ఎస్ నాయకులు మల్లీడు వెంకటేశ్వరరావు అనే వ్యక్తి అతను ఆడిందే ఆట, పాడిందే పాట, అని గ్రామస్తులు ఎవరికి వారు చెవులు కోరుకుంటున్నారు. ఆ మండలం పరిధిలో ఆ గ్రామానికి చెందినవారు ఎటువంటి అవసరం ఉన్నసరే ఎవరైనా సరే , మల్లీడు వెంకటేశ్వరరావు ను సంప్రదించాల్సిందే -???? అదేమిటని ఆశ్చర్యపోతున్నారా ఐ????లేదు, లేదు, రెవిన్యూ శాఖలో కానివ్వండి ,మట్టి దందా విషయంలో కానివ్వండి, పాసుబుక్ కావాలన్నా , మల్లి దు వెంకటేశ్వరరావు ను కలవాల్సిందే .ఈ వెంకన్నఅనే వ్యక్తి ఏది కావాలన్నా వేసు వెంటనే అధికారులు కూడా అతను ఏమి చెప్ప బోతున్నాడో అది చేయాల్సిందే . లేకపోతేఅతని మాట వినని అధికారులపై అనర్హత వేటు శాసనసభ్యులు కంటే ముందు ఇతనే వేస్తాడని ఎవరు భయం వారు గుప్పెట్లో పెట్టుకొని ఎప్పటి కప్పుడు ఉండేటివారు. గ్రామంలో గల స్మశాన వాటిక, ముస్లిమ్స్ స్మశాన వాటిక ,అందులో భాగంగా చెరువు శిఖము,తనకున్న తొమ్మిది ఎకరాలతో పాటు, మిగిలిన 32 ఎకరాలు అక్రమంగా కలుపుకొని ,దానికి బందోబస్తుగా ఫెన్సింగ్ కూడా వేయించడం జరిగిందని, మీడియా సమావేశంలో వారు తెలిపారు. శుక్రవారం మీడియా సమావేశంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ, అతను సంపాదించిన అక్రమ సంపాదన మొత్తం వెలికి తీయాల్సిందేనని వారు ఎద్దేవ చేశారు .అక్రమంగా తోలిన మట్టి తవ్వకాలు అతనికి ఉన్న భూమి 42 ఎకరాలైతే మిగతా 55 ఎకరాలు భూమి ఎక్కడి నుంచి వచ్చిందని , వారు ప్రశ్నించారు. అతనికి పాస్ బుక్కులు రెవెన్యూ అధికారులు ఎలా చేశారని, అందులో భాగంగా రైతుబంధు కూడా అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వ పాలేరు మాజీ ఎమ్మెల్యే నీ అడ్డం పెట్టుకొని , అతనుఆడిందే ఆట పాడిందే పాట, ఒకటా, రెండా , అని ఎవరికివారు చెవులు కోరుకుంటు ఉన్నారు. అతను టిఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రభుత్వం అడ్డం పెట్టుకొని చేయవలసిన మోసాలు, చేయవలసిన దగాలు, చేసాడని వారు అతనిపై ఆరోపణ చేశారు .స్మశాన వాటిక ,ముస్లిమ్స్ స్మశాన వాటిక ,చెరువు సిఖం సర్వే నంబర్లు 416 ,679 గా నమోదు చేయించడం జరిగిందని ,వారు మీడియా సమావేశంలో తెలిపారు .ఏది ఏమైనా అతని కి ఇటువంటి ఆస్తులు ఎక్కడి నుంచి వచ్చాయని ,వాటిని వెంటనే వెలికి తెలియాల్సిందేనని గ్రామస్తులు ,జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, మీడియా సమావేశంలో తెలిపారు. అతను మాటకి ఎవరైనా ఎదురు సమాధానం చెప్పినట్లయితే ,వారి మీద వెంటనే పోలీస్ వారు కేసులు నమోదు చేసిన సందర్భాలు కోకొల్లలు అని చెప్పుకోక తప్పదు . ఏది ఏమైనా మాజీ శాసనసభ్యులు కందాల ఉపేందర్ రెడ్డి ప్రధాన అనుచరులు చేగొమ్మ గ్రామ నాయకులు మల్లీడు వెంకన్న పై కఠినమైన చర్యలు తీసుకోవాలని, కాంగ్రెస్పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు కొండపర్తి సురేష్ , నర్రా సీతారాములు ,మాజీ గ్రామ సర్పంచ్ రెడ్డిమల్ల వెంకన్న, భత్తుల నాగేశ్వరరావు, మాజీ గ్రామ పంచాయతీ ఉపాధ్యక్షులు భత్తుల నాగేశ్వరరావు ,మల్లీడు సత్యనారాయణ , బొల్లికొండ శ్రీనివాస్ ,షేక్ సాహెబ్ హుస్సేన్, గ్రామస్తులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు ,అధిక సంఖ్యలో హాజరైనారు.



## ఐదు నెలల జీతం మంజూరు పట్ల హర్షం వ్యక్తం చేసిన అర్చకులు

**ఖమ్మం సూర్య మేజర్ న్యూస్ :** ధూప దీప నివేదన పథకంలో భాగంగా అర్చకులకు ఐదు నెలల జీతం ను ప్రభుత్వం మంజూరు చేయడం పట్ల ఖమ్మం ఉమ్మడి జిల్లాల అర్చకులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి,జిల్లా మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి,డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తో పాటుగా కొండా సురేఖకు అర్చకులు కృతజ్ఞతలు తెలియజేశారు.దేవాదాయశాఖ ఆఫీస్ లో స్వీట్లు పంపిణీ చేసి సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో అర్చకుల సంఘం అధ్యక్షులు మునగలేటి రమేష్ శర్మ,కార్యదర్శి భార్గవ చార్యులు,కన్వీనర్ వజ్జల ప్రసాద్ శర్మ,ఉపాధ్యక్షులు ఇంగువ పూర్ణ నంద శర్మ తదితరులు పాల్గొన్నారు.



## సీపీఎం ఆధ్వర్యంలో ప్రధాని దిష్టిబొమ్మ దగ్ధం

**బోనకల్, సూర్య (మేజర్ న్యూస్):** స్థానిక ఖమ్మం బస్టాండ్ సెంటర్లో శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని ఆ పార్టీ నాయకులు ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం రైతులపై నిర్బంధించిన కాల్పుల వలన 23 ఏళ్ల శుభకరణ్ సింగ్ మృతి కలచివేసిందన్నారు. రైతులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు, తెల్లాకుల శ్రీనివాసరావు. బోయినపల్లి వీరబాబు, బండి శ్రీనివాసరావు, ఉప్పర శ్రీను, మచ్చా గురవయ్య, బిల్లా విశ్వనాదం, బంక శ్రీను తదితరులు పాల్గొన్నారు.



# కోటిలింగాల వాగుపై సింగరేణి సంస్థ బ్రిడ్జీ నిర్మాణం

***ఎమ్మెల్యే రాందాస్ నాయక్ విన్నపంతో పరిశీలించి జీఎం***

**సింగరేణి సూర్య మేజర్ న్యూస్ :** సింగరేణి(కారేపల్లి ఫిబ్రవరి23)మండలం లోని కోటిలింగాల పుణ్యక్షేత్రంకు రహదారి,వాగుపై బ్రిడ్జి లేక భక్తులతో పాటు ఆప్రాంత రైతులు అవస్థలు పడుతున్నారు. కోటిలింగాల ఆలయం వద్ద శివరాత్రి సందర్భంగా ఐదురోజుల పాటు పెద్ద ఎత్తున జాతర జరుగుతుంది. ఈ జాతరకు కారేపల్లి, కామేపల్లి మండల ప్రజలు ఆలయానికి రావటానికి కోటిలింగాల కట్టు వాగుదాటిరావల్సి ఉంది. దీంతో అనేక ప్రమాదాలు జరిగి భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. పోలంపల్లి మోకాళ్లగుంపు నుండి కోటిలింగాల వరకు రహదారి, బిడ్జి సమస్యపై ఈనెల 18న భద్రాచలంలో జరిగిన ఐటీడీఏ పాలకమండలి సమావేశంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరారవు, ఇంచార్జీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దృష్టికి వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ తీసుకవచ్చారు. దీంతో పాటు సింగరేణి సంస్థ ద్వారా ప్రత్యేకంగా కోటిలింగాలకు రహదారి బ్రిడ్జికి నిర్మించాలని సింగరేణి సంస్థ జీఎంను ను కోరారు.ఎమ్మెల్యే వినతితో స్పందించిన ఇల్లందు ఏరియా



సింగరేణి జీఎం జాన్ అనంద్ శుక్రవారం కోటిలింగాల వాగును పరిశీలించారు. బీటీ రోడ్డు, బ్రిడ్జి నిర్మాణానికి జీఎం అంగీకరించారు. ఈకార్యక్రమంలో సింగరేణి సంస్థ ఎస్ఈ రవికుమార్, అంజిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు తలారి చంద్రప్రకాశ్, ఎస్సీ సెల్ అధ్యక్షులు మేదరి వీరప్రతాఫ్(టోనీ), మాజీ ఎంపీటీసీ గడ్డం వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్‌లు దారావత్ భద్రునాయక్, అలెం వెంకటేశ్వర్లు, నాయకులు గుగులోత్ భీముడు, తాజుద్దీన్, గుగులోత్ హర్షానాయక్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# మదర్ తెరిసా ఆశ్రమంలో తుమ్మల యుగంధర్ తనయుడు యువన్ జన్మదిన వేడుకలు





**రఘునాథపాలెం సూర్య మేజర్ న్యూస్ :** ఫిబ్రవరి 23 రఘునాథపాలెం మండలం తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు మనవడు తుమ్మల యుగంధర్ కుమారుడు యువన్ యొక్క పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ రఘునాథపాలెం మండలం మదర్ తెరిసా అనాథ ఆశ్రమంలో వారి యొక్క పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేయడం జరిగినది. పుట్టినరోజు కార్యక్రమాన్ని నిర్వహించి అక్కడ ఉన్నటువంటి వృద్ధులైనటువంటి వృద్ధులు అనాథలకు అన్నదానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఖమ్మం జిల్లా నాయకురాలు బానోతు తారాదేవి, ఇర్లపూడి మాజీ సర్పంచ్ కేలుతూ దేవ్ సింగ్ కోటేష్, వెంకన్న, బాలాజీ, రామ్మూర్తి, చెరువు కొమ్ము తండా కాంగ్రెస్ నాయకులు జంపన్న, మండల నాయకులు మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొని పాల్గొన్నారు

# సిరి చైతన్య కాళాశాల వార్షికోత్సవ వేడుకలు



**ఖమ్మం సూర్య ఎడ్యుకేషన్ :**ఖమ్మం పట్టణంలో త్రీ టౌన్ గుట్టల బజార్ గల సిరి చైతన్య కాళాశాల వార్షికోత్సవం కళాశాల ప్రిన్సిపాల్ సోమయ్య అధ్యక్షతన నర్తకి థియేటర్ పక్కన ఉన్న ఐరన్ మర్చంట్ అసోసియేషన్ ఫంక్షన్ హాల్ నందు ఘనంగా జరిగింది . ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాస్ లు పాల్గొని విద్యార్థులు ఇంటర్ దశలోనే కష్టపడి చదివితే జీవితంలో ఉన్నత శిఖరాలు అందుకుంటారని అన్నారు . మరో అతిథి జిల్లా పరిశ్రమల కేంద్ర మేనేజర్ అజయ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదివి మంచి ర్యాంకులు సాధించాలని కళాశాలకు మంచి పేరు ప్రఖ్యాతలు తేవాలని సూచించారు . ప్రైవేట్ స్కూల్ మేనేజ్మెంట్ జిల్లా అధ్యక్షులు కాంతారావు , క్రెడయలు చైర్మన్ కొప్పు నరేష్ , కోఆర్డినేటర్ శశిధర్ రెడ్డి , ఐఐటి మధు , అడ్వకేట్ వేణుగోపాల్ తదితరులు మాట్లాడుతూ చదువుతోపాటు సంస్కృతి , క్రీడారంగం కలిగి ఉండాలని క్రమశిక్షణతో మంచి మార్గంలో నడవడం అలవర్చుకోవాలని సూచించారు . ఈ కార్యక్రమంలో కళాశాల సూపర్డెంట్ రామారావు , అధ్యాపకులు రవీందర్ , శ్రీనివాస్ , నరేష్ , శ్రీలత తదితరులు పాల్గొన్నారు .





# సుఖ,క్షేయ వ్యాధులపై అవగాన సదస్సు..




**కొణిజర్ల సూర్య (మేజర్ న్యూస్)..** సుఖ వ్యాధులపై అవగాహన సదస్సును చిన్నగోపతి, పెద్దగోపతి గ్రామాలలో శుక్రవారం నిర్వహించారు.వై ఆర్ జి కేర్ లింక్ వర్కర్స్ స్కీం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సదస్సులో డి ఆర్ పి యూ.శివయ్య పాల్గొని మాట్లాడుతూ...మానవ తప్పిదంలో ఐదు నిమిషాల సుఖం కోసం తేలిక తప్పులు చేస్తున్నారని హెచ్ ఐ వి అనేది అంటువ్యాధి అది చాపకింద నీరులా ఆవరిస్తుందని రోగాల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.వ్యక్తిగత శుభ్రం,పరిసరాల పరిశుభ్రత,సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని 60 ఎడ్లు పై బడిన వారు ప్రతినెల రక్త పరీక్షలు చేయుంచు కోవాలని హెచ్ ఐ వి నిర్ధారణ అయితే ఎవ్వరు బయపడనవసరం లేదని వ్యక్తిగత వివరాలను గోప్యంగా వుంటాయని తెలిపారు. ఖమ్మంలోని ఏ ఆర్ టి సెంటర్ వద్ద ఉచితంగా మందులు అందిస్తుందని క్రమం తప్పకుండా వాడి జీవితకాలన్ని పెంచుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమలో గ్రామ కార్యదర్శులు,అంగన్వాడీ కార్యకర్తలు,లింక్ వర్కర్స్ పాల్గొన్నారు.

# టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

**జెడ్పీ చైర్మన్ లింగాల కమలరాజ్**



**బోనకల్, సూర్య (మేజర్ న్యూస్ ):** విద్యార్థులు ఏకాగ్రతతో చదివి మంచి మార్కులు సాదించాలని ఖమ్మం జడ్పీ చైర్మన్ లింగాల కమలరాజ్ సూచించారు. మండలంలోని గోవిందాపురం(ఎల్) ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెన్త్ పరీక్షలు సమీపిస్తున్నందున ప్రణాళిక ప్రకారం చదువుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేసి మెరుగైన ఫలితాలు సాదించేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

# నున్నా నరసింహారావు మృతి పట్ల మాజీ మంత్రి పువ్వాడ సంతాపం

**ఖమ్మం సూర్య మేజర్ న్యూస్..**

బిఆర్ఎస్ కార్మిక సీనియర్ నాయకులు నున్నా మాధవరావు సోదరుడు నున్నా నరసింహారావు (73) మృతి పట్ల మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సంతాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబసభ్యులకు ఫోన్ చేసి విచారం తెలిపారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు.

# సిపిఎం సీనియర్ నాయకుడు, సాయుధ పోరాట యోధుడు వైకుంఠం మృతి



**బోనకల్, సూర్య (మేజర్ న్యూస్):** మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన సిపిఎం సీనియర్ నాయకుడు వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు మచ్చ వైకుంఠం (95) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మచ్చ వైకుంఠం వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో చురుకైన పాత్ర నిర్వహించాడు. కమ్యూనిస్టు అగ్రనాయకులు పుచ్చలపల్లి సుందరయ్య, మాకినేని బసవపున్నయ్య, సంద్ర రాజేశ్వరరావు, నల్లమలగిరి ప్రసాద్ లాంటి ఉద్దండు లతో కలసి పోరాడారు .బ్రాహ్మణ పల్లి మాన్యాలను దళితులకు, పేదలకు పంచడంలో వైకుంఠం కీలకమైన పాత్ర నిర్వహించాడు. నిజాం నవాబుకు వ్యతిరేకంగా సాగిన భూమికోసం, భుక్తి కోసం, విముక్తి కోసం సాగిన పోరాటంలో వైకుంఠం పాల్గొన్నారు. బ్రాహ్మణపల్లి గ్రామంలో భూమి లేని నిరుపేదలకు దళితులకు మాన్యాలను పంపిణీ చేయడంలో వైకుంఠం కీలక పాత్ర పోషించారు. వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కమ్యూనిస్టుగా పాల్గొన్న వైకుంఠం కమ్యూనిస్టు పార్టీ చీలిక అనంతరం సిపిఎం లో చేరాడు. 1964 నుంచి మృతి చెందే వరకు వైకుంఠం సిపిఎం లోనే కొనసాగుతూ వచ్చారు. వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం అనంతరం బ్రాహ్మణపల్లి గ్రామంలో సిపిఎం ఆధ్వర్యంలో జరిగిన అనేక పోరాటాలలో పాల్గొని యువతకు ఆదర్శంగా నిలిచాడు. జిల్లా వ్యాప్తంగా సిపిఎం ఆధ్వర్యంలో జరిగిన అనేక కార్యక్రమాలలో చురుకుగా పాల్గొని యువతకు ఆదర్శంగా నిలిచాడు. వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నాటి స్ఫూర్తి నేటి యువతరంలో కొరవడిందని అనేక సార్లు తన ఆవేదన వ్యక్తం చేశాడు. ఆనాటి అమరయోధుల స్ఫూర్తితో పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు నిర్వహించాలని అనేక సందర్భాలలో పిలుపునిచ్చారు. గత కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నాడు. పరిస్థితి విషమించి మృతి చెందాడు.

# సంకల్ప యాత్రను విజయవంతం చేయండి



**కొణిజర్ల సూర్య (మేజర్ న్యూస్).. :** బిజెపి పార్టీ తలపెట్టిన విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేసేందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని ఆపార్టీ నాయకులు ప్రబారి.రుక్మరావు కోరారు.సంకల్ప యాత్రను విజయవంతం చేయటం కోసం మండల కార్యవర్గ సమావేశాన్ని అధ్యక్షులు తుప్పతి. మల్లిఖార్జున్ అధ్యక్షతన శుక్రవారం ఏర్పాటు చేశారు.ఈ సమావేశంలో రుక్మరావు పాల్గొని మాట్లాడుతూ....దేశ,రాష్ట్ర రాజకీయాలలో బిజెపి పార్టీ ముందుందని దేశప్రధాని నరేద్రమోది నాయకత్వంలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగే విధంగా అనేకసంక్షేమ పధకాల అమలు చేస్తున్నారని ముచ్చటగా మూడో సారి ప్రధానమంత్రి గా నరేంద్రమోదీనేనని జ్యోష్యం చెప్పారు. జరబోవు పార్లమెంట్ ఎన్నికల్లో విజయం కోసం ప్రజలు బిజెపి పార్టీ వైపు ఉన్నారని ఈ నెల 26 న సంకల్ప యాత్ర వైరా నియోజకవర్గంలోకి పినపాక వద్ద చేరుతుందని స్వాగతం పలికేందుకు ఈ సందర్భంగా బైక్ ర్యాలీని నిర్వహిస్తున్నట్లు అనంతరం వైరా రింగ్ రోడ్డు వద్ద బహిరంగ సభ ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్ర మానికి నియోజకవర్గ స్థాయిలోను ఉన్న జిల్లానాయకులు,మండల నాయకులు కార్య కర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.సంకల్ప యాత్రకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో వైరా అసెంబ్లీ కన్వీనర్ నెల్లూరి. కొటేశ్వరావు,కిసాంమోర్చా అధ్యక్షులు రాంబాబు,ప్రధానకార్యదర్శి కొల్లి. సుధాకర్, కుమార్, నోముల.జనార్దన్,రొంటే.కొటేశ్వరావు,వీరభద్రం,నాగర్జున్ పాల్గొన్నారు.

# హైద్రాబాద్ పబ్లిక్ స్కూల్ లో ఒకటో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

## షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు కస్తాల సత్యనారాయణ



**ఖమ్మం సూర్య (మేజర్ న్యూస్):** హైద్రాబాద్ పబ్లిక్ స్కూల్స్, రామాంతపూర్ , బేగంపేట పాఠశాలలందు 2024-25 విద్యా సంవత్సరములో మొదటి తరగతి నందు ప్రవేశం కొరకు కమిషనర్, షెడ్యూల్డు కులాల అభివృద్ధిశాఖ, తెలంగాణ ప్రభుత్వం, హైదరాబాద్ వారు ప్రవేశ ప్రకటననుసరించి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు కస్తాల సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి తరగతి యందు ప్రవేశము కొరకు రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి 1-06-2017, 31-05-2018 సంవత్సర మధ్య జన్మించిఉండాలని,దరఖాస్తులను 12-03-2024 (సాయంత్రం 5 గంటల వరకు)ఎస్సీ అభివృద్ధిశాఖ, ఐ.డి.ఒ.సి. ఖమ్మం కార్యాలయము. (కొత్త కలెక్టరేట్, వెంకటాయపాలెం)నందు సమర్పించాలని తెలిపారు హైద్రాబాద్ పబ్లిక్ స్కూల్, రామాంతపూర్ బేగంపేట స్కూలు వారు యస్.సి. విద్యార్థులకు జిల్లాకు 2 సీట్లకు (రామాంతపూర్ 1 సీటు, బేగంపేట 1 సీటు) దరఖాస్తు చేసుకొనుటకు అవకాశము కల్పించారని,ఒకే కుటుంబము నుంచి ఇద్దరు పిల్లలు దరఖాస్తు చేసుకొవచ్చునని తెలిపారు.ఈ సందర్భముగా కమీషనర్, షెడ్యూల్డు కులాల అభివృద్ధిశాఖ, హైదరాబాద్ వారు తెలిపిన విధముగా బయోడేటా ఫారముతో సంబందిత ధృవీకరణ పత్రములతో పూర్తిచేసిన దరఖాస్తులు అందజేయాలని తెలిపారు.బయోడేటా దరఖాస్తుతో జతపర్చవలసిన ధృవపత్రములు: నేటివిటి (సంబంధిత తహశీల్దారుచే జారీ చేయబడినది),పుట్టిన తేది (సంబంధిత మండల తహశీల్దారుచే లేదా మున్సిపల్ కార్పోరేషన్ లేదా మున్సిపల్ బోర్డు వారిచే జారీ చేయబడినది),ఆదాయం (తల్లి దండ్రుల కుటుంబ వార్షికాదాయము రూరల్ వారికి రూ.1,50,000/- మరియు రూ.2,00,000-00 అర్బన్ వారికి మించరాదని, ఆదాయ ధృవీకరణ పత్రము మీ-సేవ ద్వారా జారీ చేయబడినది,కులము (కుల ధృవీకరణ పత్రము మీ- సేవ ద్వారా జారీచేయబడినది) రేషన్ కార్డు ఆధార్ కార్డు జిరాక్సు కాపీని జతపర్చాలని తెలిపారు.పైన సూచించిన ధృవపత్రములు ఒరిజినల్ సర్టిఫికెట్లతో దరఖాస్తు ఫారములను సమర్పించాలని, అర్హత గల దరఖాస్తుల సంఖ్య (2) అంతకంటే లోపు అందిన యెడల లాటరీ పద్ధతి లేకుండా నేరుగా కమిషనర్, షెడ్యూల్డు కులాల అభివృద్ధిశాఖ, హైదరాబాద్ వారికి సమర్పించడం జరుగుతుందన్నారు. అర్హత గల దరఖాస్తు సంఖ్య (2) అంత కంటే ఎక్కువ వచ్చిన ఎడల ది. 15-03-2024న సాయంత్రం 3 గంటలకు డా.బి.ఆర్. అంబేద్కర్ భవనం, ఇల్లందు క్రాస్రోడ్డు, ఖమ్మం నందు లాటరీ పద్ధతి ద్వారా ఎంపిక చేసి కమిషనర్, షెడ్యూల్డు కులాల అభివృద్ధిశాఖ, హైదరాబాద్ వారికి సమర్పిండం జరుగుతుందని తెలిపారు. విద్యార్థుల బయోడేటా ఫారముతో సమర్పించిన దరఖాస్తులకు పైన తెలుపబడిన ధృవపత్రములు ఒరిజినల్ సర్టిఫికెట్లతో జతపర్చి సమర్పించవలెను. లేని యెడల అట్టి దరఖాస్తులు స్వీకరించబడవని రికమెండ్ చేయబడవని తెలిపారు. నేరుగా హైద్రాబాద్ పబ్లిక్ స్కూల్, రామాంతపూర్ / బేగంపేట స్కూల్స్ నందు అప్లయ్ చేసుకొనే విద్యార్థినీ విద్యార్థులకు ప్రభుత్వం వారు ఇచ్చు ఉపకారవేతనములకు (స్కాలర్షిప్లకు) అర్హులు కాదన్నారు.

# పోటీ పరీక్షల శిక్షణ కొరకు ఎస్సీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో దరఖాస్తులు ఆహ్వానం

## షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు కస్తాల సత్యనారాయణ



**ఖమ్మం సూర్య (మేజర్ న్యూస్):** బ్యాంకింగ్, ఆర్.ఆర్.బి., ఎస్.ఎస్.సి., తో సహా రాష్ట్ర ప్రభుత్వంచే భర్తీ చేయబడే ఇతర ఉద్యోగాల పోటీపరీక్షల శిక్షణ కొరకు జిల్లా కలెక్టర్ చైర్మన్ గా తెలంగాణ స్టేట్ షెడ్యుల్డ్ కులముల స్టడీ సర్కిల్ (ఎస్సీ.డి.డి), ఖమ్మం బ్రాంచ్ నందు 5 నెలల ఉచిత కోచింగ్ కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు కస్తాల సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ స్టడీ సర్కిల్ నందు 100 మందికి రెసిడెన్షియల్ కోచింగ్ ఇవ్వబడుతుందని, ఎస్సీలకు 75 శాతం, ఎస్టీలకు 10 శాతం, బీసీలకు 15 శాతం సీట్లు ఉంటాయని,మొత్తంగా 33శాతం సీట్లు మహిళలకు, 5 శాతం సీట్లు వికలాంగులకు రిజర్వ్ చేయబడినట్లు తెలిపారు. భోజనం, వసతి, ఉత్తమ ఫ్యాకల్టీతో శిక్షణ, స్టడీ మెటీరియల్స్, వారాంతపు పరీక్షలు మొదలగునవి కలిగిన ఈ శిక్షణ ఐదు నెలలపాటు కొనసాగుతుందని తెలిపారు. ఈ స్టడీ సర్కిల్లలో ప్రవేశానికై ఎంపిక, పోటీ పరీక్ష ద్వారా నిర్వహించబడుతుందని,అట్టి పరీక్షకై ఫిబ్రవరి 23, 2024 నుండి, స్టడీ సర్కిల్ వెబ్సైట్ %ఫ్ట్రిజూ:ౕ//ంర్బసఎ-ఎఱతీఎశ్రీవ.ఎశీ.ఱఅ%/ నందు దరఖాస్తు చేసుకొనవచ్చునని పేర్కొన్నారు.. దరఖాస్తు చేసుకునేందుకు ఆఖరి తేదీ మార్చి 6, 2024 అని,పరీక్ష హాల్ టికెట్లు మార్చి 7వ తేదీ నుంచి డౌన్లోడ్ చేసుకోవచ్చని,పోటీ పరీక్ష మార్చి 10, 2024 న ఉదయం 11.00 గంటలు నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు ఖమ్మం జిల్లా కేంద్రంలో నిర్వహించబడుతుందన్నారు. శిక్షణ మార్చి 18, 2024 నుంచి మొదలై ఆగస్టు 17, 2024 న ముగుస్తుందని తెలిపారు. యస్.సి., యస్.టి., బి.సి (మైనారిటీలతో సహా) కులాలకు చెందిన, నలభై నాలుగేళ్ళలోపు వయసు కలిగిన, డిగ్రీ పరీక్ష ఉత్తీర్ణులైన, సంవత్సరానికి మూడు లక్షల లోపు కుటుంబ ఆదాయం కలిగిన అభ్యర్థులు ఈ ప్రవేశపరీక్షకై దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని, అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులందరూ దరఖాస్తు చేసుకావాలని తెలిపారు.కావలసిన సర్టిఫికేట్ లు,కులం సర్టిఫికెట్,ఒక సంవత్సరం నిండనటువంటి ఆదాయం సర్టిఫికెట్, డిగ్రీ సర్టిఫికెట్ ,వయసును తెలిపే పదో తరగతి సర్టిఫికెట్,ఆధార్ కార్డు, పాస్ పోర్ట్ సైజు ఫోటో, అంగవైకల్యం సర్టిఫికెట్ (వర్తించేవారికి మాత్రమే) లను సిద్ధం చేసుకుని స్టడీ సర్కిల్ వెబ్సైట్ నందు దరఖాస్తు చేసుకోవాలనీ తెలిపారు.గతంలో ఏదైనా జిల్లా కేంద్రం లోని ఎస్సీ స్టడీ సర్కిల్ నందు 5 నెలల ఉచిత శిక్షణ పొందిన, హైదరాబాద్ నందు గల రాష్ట్ర ఎస్సీ స్టడీ సర్కిల్ నందు సివిల్స్ కొరకు శిక్షణ తీసుకున్న అభ్యర్థులు, ఈ కోర్సుకు దరఖాస్తు చేయుటకు అర్హులు కాదు అనితెలిపారు.

# అంగన్వాడీ కేంద్రాలకు కుర్చీలు అందజేత





**రఘునాథపాలెం ,ఫిబ్రవరి 23 :**రఘునాథపాలెం మండల పరిధిలోని కోయచలక ,రేగులచలక అంగన్వాడీ కేంద్రాలకు శుక్రవారం పరిశ సీతారత్నం ఛారిటబుల్ ట్రస్ట్ కుర్చీలు అందజేసింది .చిన్నారుల వికాసం, గర్భిణీ స్త్రీలు మరియు బాలింతల ఆరోగ్యం కోసం ప్రారంభించిన అంగన్వాడీ కేంద్రాలకు కనీస మౌలిక వసతుల కల్పనలో భాగంగా పరిశ సీతారత్నం ఛారిటబుల్ ట్రస్ట్ ఇప్పటికే పలు అంగన్వాడీ కేంద్రాలకు కుర్చీలు సమకూర్చిందని ,ఈరోజు కోయచలక, రేగులచలక కేంద్రాలకు కుర్చీలు అందజేస్తున్నట్లు ట్రస్ట్ ఛైర్మన్ పరిశ పుల్లయ్య తెలిపారు. చిన్నారి బాలబాలికలకై 15 కుర్చీలు, గర్భిణీ స్త్రీలు కొరకు 5 కుర్చీలు చొప్పున కోయచలక ,రేగులచలక కేంద్రాలకు అందజేసామని ,వాటిని సద్వినియోగం చేసుకోవాలని ట్రస్ట్ చైర్మన్ పుల్లయ్య అంగన్వాడీ ఉపాధ్యాయినులను కోరారు. ఈకార్యక్రమంలో రఘునాథపాలెం క్లస్టర్ పర్యవేక్షకురాలు గూడూరు కృష్ణకుమారి, కోయచలక ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయిని మందడపు రమాదేవి, కోయచలక అంగన్వాడీ టీచర్ మంగిశెట్టి వెంకటలక్ష్మి,ఆయా చెరుకూరి జయప్రద, రేగులచలక అంగన్వాడీ టీచర్ జి.రాజేశ్వరి, ఆశాకార్యకర్త యర్రబెల్లి సుశీల, చిన్నారుల తల్లులు, గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.



# విద్యుత్‌కు అంతరాయం కలిగితే ఎటువంటి వారినైనా ఉపేక్షించేది లేదు



**కూసుమంచి ఏడిఈ కోక్యా నాయక్ వెల్లడి..**

**కూసుమంచి సూర్య మేజర్ న్యూస్ :** కూసుమంచి సబ్ డివిజన్ పరిధిలో విద్యుత్తుకు ఇటువంటి అంతరాయం తలెత్తిన ఇటువంటి వారైనా శిక్షకు అర్హులేనని కూసుమంచి ఏడిఈ కోక్యా నాయక్ మీడియా సమావేశంలో వెల్లడి చేశారు. అందులో భాగంగా విద్యుత్ సరఫరా చేసేందుకు అవసరమైన చర్యలను చేపట్టాలని ఆయన విద్యుత్ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.శుక్రవారం సబ్ డివిజన్ పరిధిలోని నేలకొండపల్లి, రాజేశ్వరపురం, కూసుమంచి, పాలేరు, బచ్చోడు, సబ్ స్టేషన్ల పరిధిలోని విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశాన్ని సమావేశాన్ని ఆయన ఏర్పాటు చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన విద్యుత్ వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరాను అందచేయాలని, దాని కనుగుణంగా క్షేత్రస్థాయిలోని అధికారులు సరఫరా కోసం చర్యలు తీసుకోవాలని, అధికారులను ఆయన ఆదేశించారు. త్వరలో వేసవి సమీపిస్తున్న తరుణంలో విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయం లేకుండా చూడాలని, వ్యవసాయానికి, గాని, మంచినీటి సరఫరాకు గాని, గృహ అవసరాలకు వినియోగదారులకు ఇటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా చూడాలని ఆయన వారిని కోరారు. దాని కనుగుణంగా క్షేత్రస్థాయిలోని అధికారులు పటిష్టమైన ప్రణాళికతో వ్యవహరించాలని, సూచించారు. అదేవిధంగా లైన్లను, ట్రాన్స్‌ఫార్మర్‌లను తరచూ పరిశీలించడం ద్వారా అంతరాయం కలగకుండా చూడాలన్నారు. విద్యుత్ మరమ్మతులకు సంబంధించి ఒక సమయం కేటాయించి ఎల్ సి తీసుకోవాలని, సూచించారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు.

# విద్యార్థులు మానసిక ఒత్తిడిని అధిగమించాలి





*డా. శివకృష్ణ న్యూరో సైకియాట్రిస్ట్*

*డా.శశాంక దర్మటాలజీ అండ్ కాస్మటాలజీ*

**ఖమ్మం సూర్య మేజర్ న్యూస్ :** ఖమ్మం నగరంలోని పుట్టకోట లో గల బొమ్మ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాలేజ్ నందు నిర్వహిస్తున్న తిరుమలాయపాలెం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల /కళాశాల నందు పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో శాన్వి హాస్పిటల్ న్యూరో సైకియాట్రిస్ట్ శివకృష్ణ మరియు డా. శశాంక (డెర్మటాలజీ అండ్ కాస్మటాలజీ ) ముఖ్య అతిథులుగా పాల్గొని పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే పదవ తరగతి,ఇంటర్మీడియట్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. డాక్టర్ శివకృష్ణ, శశాంక లు మాట్లాడుతూ... ప్రశాంతమైన వాతావరణంలో విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాలని అలాగే మనోధైర్యం కలిగి, ఆత్మవిశ్వాసంతో ఉండాలని, మానసిక ఒత్తిడిని అధిగమించాలని, సరైన మోతాదులో ఆహారం తీసుకోవాలని, పాజిటివ్ థింకింగ్ అవసరమని తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బోస్, హెల్త్ డా. సమ్మయ్య విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ సరైన సమయం లో నిద్ర పోవాలని, సబ్జెక్ట్ లను రోజువారీగా రివిజన్ చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలోతిరుమలాయపాలెం గురుకుల పేరెంట్స్ కమిటీ చైర్మన్ సీనియర్ జర్నలిస్ట్ పప్పుల వేణుగోపాల్,శాన్వి హాస్పిటల్ మేనేజర్ చింతమళ్ల అంజయ్య, ఆధ్యాపక బృందం మురళి, వాసు, వేదాంతచార్య మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# క్రికెట్ క్రీడాకారులకు మంత్రి పొంగులేటి ఆర్థిక సాయం



**ఖమ్మం సూర్య బ్యూరో :** ఈనెల 24, 25, 26 వ తేదీల్లో హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో జరిగే సేవాలాల్ మహారాజ్ రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు వెళ్లే జిల్లా జట్టు క్రీడాకారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆర్థిక సహాయం అందచేశారు. రూ. 15వేల మొత్తాన్ని ఖమ్మం క్యాంప్ కార్యాలయ సిబ్బంది కూసుమంచి మండలానికి చెందిన భూక్య వేణు మాధవన్, వెంకటేష్ వడిత్య విజయ్, గుగులోత్ శ్రీకాంత్ అనే క్రికెట్ క్రీడాకారులకు అందించారు. క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జ్ దయాకర్ రెడ్డిని కలిసి.. తమ రవాణా, ఇతర ఖర్చులకోసం సాయం చేయాలని విన్నవించగా.. వెంటనే స్పందించి రూ. 15,000 ఆర్థిక సాయంగా అందించారని వారు ఆనందం వ్యక్తం చేశారు.

# ఎమ్మెల్యే లాస్య నందిత మృతి పట్ల వైరా మునిపల్ వైస్ ముళ్ళపాటీ సీతారాములు దిగ్భ్రాంతి



**వైరా సూర్య మేజర్ న్యూస్** :కంటోన్మెంట్ యువ ఎమ్మెల్యే లాస్య నందిత మృతి పట్ల వైరా మునిపల్ వైస్ చైర్మన్ ముళ్ళపాటీ సీతారాములు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గతేడాది ఫిబ్రవరిలో కంటోన్మెంట్ సీనియర్ ఎమ్మెల్యే అయిన తన తండ్రి సాయన్న మృతి నుండి ఇంకా కోలుకోక ముందే, ప్రజా సేవలో ఆయన వారసత్వాన్ని కొనసాగిస్తూ కంటోన్మెంట్ ప్రజల మన్ననలు పొందిన యువ ఎమ్మెల్యే లాస్య నందిత ఆకస్మిక మరణం అత్యంత బాధాకరమన్నారు. ఆమె మరణం కంటోన్మెంట్ ప్రజలకు, బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు.